ఆదివారం
ప్రజాశక్తి
సెప్టెంబర్ 7, 2003

పోషకాహారం - పుష్టికర ఆరోగ్యం

హ్యాపీ బర్త్‌డే

(7-9-2003 నుండి
13-9-2003 వరకు)

వి. అనూష
8॥సం, 7.9. 1995
మంజుల- సదానందం
జమిస్తాన్‌పూర్- హైదరాబాద్

కె. లతామాధురి
4॥సం, 1999
ఉమ- సత్యనారాయణ
కుషాయిగూడ- రంగారెడ్డి

ఎస్. మణిసింధూర
1సం॥, 7. 9. 2002
కృష్ణప్రియ-గిరిధర్
ఎల్.ఐ.జి. కాలనీ-విజయవాడ

ఎ.కె. హర్షవర్ధన్
సరళకుమారి- శ్రీనివాస్
పాణ్యం- కర్నూలు



ఎస్.కె. అబ్దుల్ మోహీద్
1సం॥, 9.9.2002
సాలిహ-చాన్‌బాషా
వెంకటేశ్వరపురం- నెల్లూరు

చంటి
1సం॥, 11.9.2002
అనిత- రవీందర్
రేగొండి-రంగారెడ్డి

తేజశ్రీ
1సం॥, 11. 9.2002
అంజనీదేవి- శ్రీనివాసరావు

జె. కవిత
2సం॥, 11. 9. 2001
సువర్ణ- స్వామి
కార్మికనగర్- హైదరాబాద్



జి. నీరజ్‌కుమార్
1సం॥, 12.9.2002
పద్మ- మురళీధర్
ఉప్పల్- హైదరాబాద్

బి. నందిని
1సం॥, 13. 9. 2002
అన్నపూర్ణ- శ్రీనివాసరావు
మంగళగిరి- గుంటూరు



ఎస్‌కె. రియాజ్
సెప్టెంబర్-13
బాబు- పర్వీన్
ముత్తుకూరు- నెల్లూరు

మనలో మాట

డిఫరెంటు సినిమా..

'డిఫరెంటు' అనే ఇంగ్లీషు పదం – బొత్తిగా తెలుగు మాటగా ముద్రవేయించుకుంటోంది!

'డిఫరెంటు' అనగానే ఉత్సాహ పడతాం!

పాత చింతకాయ బ్రాండు కాదని భ్రమ పడతాం!

అబ్బో అదిరిపోతుందని ఆశ పడతాం!

కొత్తగా ఏదో వెలగబెడుతుందని గట్టిగా నమ్ముతాం!

అంచేత – ఎవరైనా డిఫరెంటు అనే పదం వాడగానే ఉలికి పడతాం. ఆ మాటకు అంత శక్తి ఉంది. అంత గొప్ప మహత్తు ఉంది!

వ్యాపారం చేసుకునే మనిషికిది తారక మంత్రం!

ఒంటికి రుద్దుకునే సబ్బుల కంపెనీ కావచ్చు. మొహానికి పులుముకునే పౌడరు కావచ్చు. తలకు రాసుకునే అంబాజీపేట ఆముదమే కావచ్చు!

సదరు ఉత్పత్తిదారులు తప్పనిసరిగా డిఫరెంటనే ముక్కనే తమ ప్రచారంలో వాడుకుంటారు. లేకపోతే పుట్టగతులుండవు. వాళ్ళ ఉత్పత్తులకు గిరాకీ అసలుండదు!

నిన్నా మొన్నా లేని దినుసు – భూలోకంలో ఇవాళే కొత్తగా దిగుమతి అయ్యిందనే ధ్వని – 'డిఫరెంటు' అనే ముక్తాయింపుతో మనల్ని ముగ్ధుల్ని చేస్తుందని మనం అర్థం చేసుకోవాలి!

ముఖ్యంగా–

సినిమా వాళ్ళు ఈ 'డిఫరెంటు' ఆయుధాన్ని ప్రేక్షక లోకమ్మీద విరివిగా ప్రయోగిస్తుంటారు!

మేము తీసే సినిమా డిఫరెంటుగా ఉంటుందంటారు!

అనగా–

గత ఏడు తరాల్లో ఈ టైపు సినిమా తెలుగు తెర మీద వెలగలేదని అర్థం! ముందు రాబోయే మరో ఏడు తరాల్లో కూడా ఇల్లాంటి సినిమా చూసే ఛాన్సు లేదని మీనింగు!

డిఫరెంటు అనే శబ్దంలో ఇంత హామీ ఉంది!

విడుదల కాబోయే ప్రతి సినిమా ప్రకటనా ఇదే టైపులో ఉంటుంది. దీనికి మాత్రం డిఫరెంటుగా వినిపించే అవకాశం లేదు. ఇక ముందు రాదు!

వాళ్ళు తీసే సినిమా – మంగమ్మ శపథమే కావచ్చు! అయినా సరే – డిఫరెంటు కథంటారు! డిఫరెంటు లవ్ స్టోరీ అంటారు. డిఫరెంటు సెంటిమెంట్, డిఫరెంటు ఎమోషన్లు ఈ సినిమా ప్రత్యేకతలంటారు. సంగీతం సరేసరి! డిఫరెంటు అనే పదానికి పర్యాయ పదమంటారు!

ఇంత డిఫరెంటు సినిమా మీద బోలెడు ఆశలు పెట్టుకుని – బ్లాకులో టిక్కట్టు కొనుక్కుని వెడతాం!

డిఫరెంటు డిఫరెంటని ఊదరగొట్టిన ఆ సినిమా 'మంగమ్మ శపథాన్ని' గుర్తు చేస్తుంది!

దీన్నే డిఫరెంటు సినిమా అంటారు! శుభం! ●

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం . . . 2
రియల్ స్టోరీ . . . 4
కవర్‌స్టోరీ . . . 5
గేయలహరి . . . 9
బాలవికాసం . . . 10
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
కచేరి . . . 14
ఇంతిసంగతులు . . . 15
క్రీడారంగం . . . 17
పుస్తక పరిచయం . . . 20
పలుకుబడి . . . 24

ఇంకా...

దేశం బాగుపడాల్నంటే...
జీవనశైలి . . . 8



శిల్ప కళా నిలయం శ్రీరంగం
టూరిస్ట్‌గైడ్ . . . 16



(అ)న్యాయ నిర్ణయం
కథ . . . 18, 19



ఇంతకీ అది మెదడు వాపు వ్యాధేనా?
ఆరోగ్యం . . . 22, 23

కార్టూన్ కదంబం


మా గురించి 'సుప్రీం' నివేదిక కోరిందిగా "ఈ అబ్బాయిలు చాలా మంచోళ్లు అని రాయండి.. క్యాచీగా ఉంటుంది!!
సిబిఐ

అయ్యా! ముందుగా.. క్షమాపణలతో అని వ్రాయమంటారా?
ఇంటింటికి బాబు లేఖలు


ఫైనాన్స్ కంపెనీ
మావద్ద వెహికల్స్ పెట్రోల్ కొనడానికి ఋణం ఇవ్వబడును
భారీగా పెరిగిన పెట్రోల్ ధరలు


హమ్మయ్య! భూమిలో మట్టి, రాళ్లు ఉన్నాయని రుజువయ్యింది.. కనుక ఇక గుడి కట్టేద్దాం!!
వివాదస్పద స్థలం

ఇంగ్లీషు

సులభంగా నేర్చుకోండి సరళంగా మాట్లాడండి!

ఇంగ్లీషు నేర్పించటంలో ఇండియాలోనే నెం.1 ఇంగ్లీష్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అని ప్రసిద్ధి చెందిన వివేకానంద ఇన్‌స్టిట్యూట్ గత 22 సంవత్సరాలుగా 15 లక్షలమందికి పైబడినవారిని వారి మాతృభాషలో సులభమైన శిక్షణ ద్వారా సరళంగా ఇంగ్లీషులో మాట్లాడించి విజయం సాధించింది.

దక్షిణ భారతదేశం అంతటా 81 ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు నెలకొల్పింది.

ప్రత్యక్ష శిక్షణ తరగతులు ఉదయం 7-00 గంటలనుండి రాత్రి 8-30 గంటలవరకు జరుగుతాయి. మీ దగ్గరలోవున్న మా ప్రత్యక్ష శిక్షణ కేంద్రంలో నేడే సంప్రదించి మీకు అనుకూలమైన తరగతిలో చేరితే చాలు. మీరు సులభంగా శిక్షణ పొంది సరళంగా ఇంగ్లీషు మాట్లాడవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో వున్న మా ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు:

హైదరాబాదులో:

ఎస్.ఆర్. నగర్
నెం.102, సాయి మేనర్, ఎస్.ఆర్. నగర్ సర్కిల్,
హైదరాబాదు-38. ☎ 23714330.

మెహదీపట్నం
308, సకీనా కాంప్లెక్స్, మెహదీపట్నం X రోడ్స్,
మెహదీపట్నం, హైదరాబాదు-28.
☎ 55585223.

దిల్‌షుక్ నగర్
16-11-477/3/D, I ఫ్లోర్,
లింగారెడ్డి కాంప్లెక్స్, దిల్‌షుక్ నగర్,
హైదరాబాదు-60. ☎ 24044352.

కుక్కట్‌పల్లి
MIG - 214, K.P.H.B. మెయిన్ రోడ్,
(బ్యాంక్ ఆఫ్ మధుర మేడపైన), కుక్కట్‌పల్లి,
హైదరాబాదు-72. ☎ 55341431.

వనస్థలిపురం
HIG 59, I ఫేస్, రాజధాని జూనియర్
కాలేజ్ బిల్డింగ్, వనస్థలిపురం,
హైదరాబాదు-70. ☎ 24122464.

రామచంద్రపురం
2-34-1/A, చందా నగర్, విజయరాఘవ రెడ్డి
అపార్ట్‌మెంట్స్ ఎదురుగా, రామచంద్రపురం,
హైదరాబాదు-50. ☎ 23032564.

మరియు

ఖమ్మం
డోర్ నెం. 8-2-162, ఫస్ట్ ఫ్లోర్, వైరా రోడ్,
L.I.C. ఆఫీస్ దగ్గర, ఖమ్మం-1. ☎ 227698.

కాకినాడ
నెం. 10-5-44, కర్రి కాంప్లెక్స్,
నాగేశ్వరరావు వీధి, రామారావు పేట,
కాకినాడ-4 ☎ 2386638.

విజయవాడ
5-19/8A, రెవెన్యూ కాలనీ, సిద్ధార్థ అకాడమి ఆఫ్
ఆర్ట్స్&సైన్స్ కాలేజ్ ఎదురుగా, మొగల్‌రాజపురం,
విజయవాడ-10. ☎ 2630053.

తిరుపతి
నెం. 10/14/582, సెకెండ్ ఫ్లోర్,
వి.వి.మహల్ రోడ్, తిరుపతి-1. ☎ 2252878.

కడప
మెడ్రాస్ రోడ్, బ్లైండ్ బాయ్స్ స్కూల్ ఎదురుగా,
శంకరాపురం, కడప-1. ☎ 24445.

కర్నూలు
ఫస్ట్ ఫ్లోర్, దావూద్ కాంప్లెక్స్, చిల్డ్రన్ పార్క్
ఎదురుగా, కర్నూలు-4. ☎ 228770.

నెల్లూరు
16/366, జె.యన్.రోడ్, IV టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా,
వి.ఆర్.సి. సెంటర్, నెల్లూరు-1. ☎ 2327702.

గుంటూరు
డోర్ నెం. 5-87-3/A, II ఫ్లోర్, మణిపాల్
సెంటర్, లక్ష్మీపురం మెయిన్ రోడ్,
గుంటూరు-7. ☎ 2238541.

విశాఖపట్నం
50-50-30/11, బాలయ్య శాస్త్రి లేఅవుట్,
గురుద్వార జంక్షన్, సీతమ్మధార,
విశాఖపట్నం-13. ☎ 2738892.

నిజామాబాద్
5-11-229, పాత L.I.C. ఆఫీస్ వద్ద,
ప్రగతి నగర్, నిజామాబాద్-3. ☎ 235767.

రాజమండ్రి
B1, మౌనిక టవర్స్, కోటిపల్లి బస్‌స్టాండ్ వద్ద,
ఇన్నీస్‌పేట, రాజమండ్రి-1. ☎ 2422003.

కరీంనగర్
మారుతి కాంప్లెక్స్, H.No. 2-8-242, కేష్టన్
రఘునందన్ రోడ్, కరీంనగర్-1. ☎ 2234883.

వరంగల్
H. No. 5-11-244, నైమ్ నగర్, హన్మకొండ,
వరంగల్-9. ☎ 2578946.

అనంతపూర్
H.No. 14-137, ఫస్ట్ ఫ్లోర్, బ్యాంక్ ఆఫ్ బరోడా లైన్,
కమలా నగర్, అనంతపూర్-1. ☎ 241029

మిరియాలగూడ
చర్చ్ రోడ్, సాయిరామ్ బుక్ స్టాల్ దగ్గర,
మిరియాలగూడ-7. ☎ 230130.

VIVEKANANDA INSTITUTE

Flat No.103, Sri Hayagreeva Complex,
10-3-171/3, St. John's Road,
Secunderabad - 500 025.

H.O.: **9, Madley Road, T.Nagar,
Chennai - 600 017.**

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలలో చేరలేనివారు తపాలా ద్వారా కూడా శిక్షణ పొందవచ్చు. తపాలా ద్వారా శిక్షణ పొందగోరేవారు **Vivekananda Institute, 9 (T), Madley Road, T.Nagar, Chennai - 600017** అనే చిరునామాకు ఉత్తరం వ్రాయండి. వెంటనే మీకు పూర్తి వివరాలను పంపించగలము.

దయ్యాన్ని పట్టిన యువకులు

✳ యాసలపు సూర్యారావు

అదొక పల్లెటూరు. ఊరు పేరు పెదబ్రహ్మదేవం. తూర్పు గోదావరి జిల్లా సామర్లకోట మండలంలో వున్నది. ఆ ఊరిలో ఎన్నడూ లేని విధంగా ఊరి ప్రజలు అట్టుడుకుతున్నారు. గుంపులు గుంపులుగా చేరి ఎడతెరిపి లేని చర్చలు జరుపుతున్నారు. అంతా భయం. ఏ నోట విన్నా దయ్యం ఇంటిపై రాళ్ళు విసరటం గురించే చర్చ. చిన్న, పెద్ద అన్న తేడా లేకుండా అంతా భయభ్రాంతులవుతున్నారు. ప్రతిరోజూ రాత్రి 10 గంటలు దాటాక ఆ గ్రామంలో ఒక ఇంటిపై దయ్యం రాళ్ళు విసురుతోంది.



ఆ ఇంట్లో ముసలి దంపతులు కాపురం వుంటున్నారు. వాళ్ళు కూడా ఇంటిని వదిలేసి బయటకు వచ్చేవారు. తెల్లవారిన తర్వాతే ఇంటికి వెళ్ళేవారు. ఈ విధంగా ఇంటిపై రాళ్ళు పడుతూ ఉండేవి. రాత్రి అయిందంటే చాలు ఊరిని నిశ్శబ్దం ఆవరించేది. భయం తాండవించేది. అప్పటికే ఊరివాళ్ళ సహాయంతో ఆ ముసలివాళ్ళు నలుగురైదుగురు, భూత వైద్యుల్ని తీసుకురావటం, వాళ్ళు రకరకాల మంత్రాలు, తంత్రాలు నిర్వహించి ఇంటి వారి వద్ద వెయ్యి, రెండు వేలు గుంజుకొని పోయేవారు. ఈ విధంగా సుమారు ఆరువేల రూపాయలు వదిలించుకున్నారు. అయినా సమస్యలో మార్పు లేదు.

ఇదిలా ఉండగా ఆ ఊరిలోనే వున్న కొంతమంది అభ్యుదయ యువకులు అప్పటికే ఆ గ్రామంలో ఒక యువజన సంఘాన్ని స్థాపించుకున్నారు. వారు ఆ గ్రామంలో అనేక అభ్యుదయ కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారు. ఆ యువకులు ఊరిలో జరుగుతున్న దయ్యం రాళ్ళు విసురుతున్న సంఘటనపై స్పందించారు. సమస్యను మేం పరిష్కరిస్తాం మాకు అప్పగించండి అని వారు అడిగారు. దానికి గ్రామ పెద్దలు, ఇంటి యజమాని కొంత ఆశ్చర్యానికి లోనయ్యారు. కుర్రాళ్ళు మీరు ఎలా సమస్యను పరిష్కరిస్తారు అని సందేహాన్ని వ్యక్తం చేశారు. సమస్యను మేము పరిష్కరిస్తాం అని ఆ యువకులు సవాల్ చేశారు. అందుకు పెద్దలు, ఇంటి యజమాని అంగీకరించారు. దానితో యువకులు రంగంలోకి దిగారు.

మొదట రాళ్ళు పడుతున్న ఇంటి చుట్టు పక్కల గల ఇండ్లలో నివసించే వ్యక్తుల వద్దకు వెళ్ళి వారి చేతి ముద్రలను తెల్లకాగితంపై తీసుకున్నారు. రాళ్ళు పట్టుకొని విసిరిన వారి చేతి ముద్రలు కాకినాడ ఫోరెన్సిక్ పరీక్షకు పంపేందుకు వారు అలా వేలిముద్రలు సేకరించారు. మధ్యన ఒక రోజు విరామం తర్వాత కూడా దయ్యం రాళ్ళు విసరడం మానలేదు. మళ్ళీ ఊళ్ళో చర్చ మామూలే! వీళ్ళు మాత్రం ఏం చేయగలిగారంటూ పెదవి విరిచారు. యువకులు మరొక కొత్త వ్యూహాన్ని పన్నారు.

ఒక రోజు రాత్రి ఎవ్వరికీ తెలియకుండా కొంతమంది యువకులు, మనిషికి ఒక టార్చిలైట్ దగ్గర పెట్టుకొని, ఆ ఇంటికి కొద్ది దూరంలో నాలుగు వైపులా మాటు వేశాను. ఇది వారికి తప్ప వేరే వాళ్ళకు తెలియదు. ఎలాగూ చీకటి పడితే ఎవరూ బయటకు రారు. కాబట్టి వారి వ్యూహానికి మంచి అవకాశం ఏర్పడింది.

అంతా నిర్మానుష్యంగా ఉంది. చిమ్మచీకటి. బితుకూ, బితుకూ మంటూ ఉంది. మిణుగురుల శబ్దాలు విన్పిస్తున్నాయి. రాత్రి 10-30 కావస్తోంది. చీకట్లో ఒక ఆకారం అడుగులో అడుగు వేసుకుంటూ అడుగుల శబ్దం కూడా రానంత నెమ్మదిగా నడిచి వస్తోంది. ఆడా, మగా ఎవరు అనేది అర్థం కావడం లేదు. ఇది గమనించిన యువకులు మరింత ఉత్సాహాన్ని తెచ్చుకుని తమ కార్యం సఫలం కాబోతోందని మరింత పట్టుదలను పెంచుకున్నారు.

ఆ శాల్తీ రానే వచ్చింది. ఆ కార్యం ప్రారంభించింది. రాళ్లు ఎప్పటిలాగే ఇంటిపైన పడుతూనే వున్నాయి. అంతే ఇదే అదననుకొని చుట్టూ మాటు వేసిన యువజన సంఘం కార్యకర్తలు ఒక్కసారిగా బయటకు వచ్చి రాళ్ళు విసురుతున్న దయ్యాన్ని పట్టుకున్నారు. ఒక్కసారిగా దయ్యం కెవ్వుమని పెద్దగా అరిచింది. వెంటనే యువకుల చేతుల్లో టార్చిలైట్లు వెలిగాయి. దయ్యం అసలు రహస్యం బట్టబయలయింది.

ఆ దయ్యం ఎవరో కాదు. ఇంటి యజమానులైన వృద్ధులకు స్వయానా కోడలే. ప్రతిరోజూ తాను కట్టుకున్న చీర కొంగులో రాళ్ళు మూటగట్టుకొని ఒంటరిగా వచ్చి ఇలా చేస్తోంది. ఆమెను పట్టుకొన్న యువకులు వెంటనే గ్రామంలోని పెద్దలను, ఇంటి యజమానిని పిలిచి జరిగిన సంగతి వివరించారు. ఆమె ఇలా ఎందుకు చేస్తుందో చెప్పమని గట్టిగా నిలదీశారు. దానికి ఆమె తప్పయిపోయింది. తనను వదిలేయమని ప్రాధేయ పడింది. అయినా యువకులు, పెద్దలు వినలేదు. చెప్పి తీరాలని పట్టుపట్టారు. గత్యంతరం లేక ఆమె తను అలా చేయడానికి గల కారణాన్ని విప్పి చెప్పింది. అత్తమామల నుండి ఆ ఇల్లు ఖాళీ చేయించడం కోసం ఇలా చేశాను. అలా చేస్తే దెయ్యాలకు భయపడి ఇల్లు ఖాళీ చేస్తారని, ఆ తర్వాత తను, తన పిల్లలు ఇల్లు కాజేయాలనే ఆలోచనతో ఇలా ప్రవర్తించాననీ అంగీకరించింది.

ఈ దయ్యం గుట్టు రట్టు చేయటంలో చొరవ తీసుకున్న ఆ గ్రామ యువజన సంఘం కార్యకర్తలు కృష్ణారావు, సుబ్బారావు, అబ్బాయి, పాపారావు కలుగజేసుకొని అక్కడ వున్న వారందరికీ అర్థమయ్యే విధంగా ఇప్పటికైనా మీరు వాస్తవాన్ని గ్రహించండి. దెయ్యాలు, భూతాలు అనేవి అసలు లేవు. అవి కేవలం మూఢనమ్మకాలే. భూతప్రేతాలను వదిలిస్తామని చెప్పి భూతవైద్యులు అమాయకుల నుండి డబ్బు గుంజుకుని పబ్బం గడుపుకుంటారని హితవు పలికారు. ఇదంతా విన్న పెద్దలు, ఇంటి యజమాని ఆ యువకుల్ని అభినందించారు. దీనితో గ్రామస్థులంతా తేలికగా ఊపిరి పీల్చుకున్నారు. ●

✳ శ్రీధర్‌బాబు బంగారు

పోషకాహారం - పుష్టికర ఆరోగ్యం



మనది ఒక వింత ప్రపంచం. చాలా మంది వద్ద వారికి ఏ మాత్రం అవసరం లేని పదార్థాలు అపారంగా ఉంటాయి. వారికి కొనేశక్తి ఉంది కాబట్టి వాటిని కొంటారు. తరువాత చెత్తబుట్ట పాలు చేస్తారు. అదే మరికొందరికి ఆ వస్తువుల అవసరం ఎంతగానో ఉంటుంది. అయితే వారికి కొనే శక్తి లేదు కనుక అవి దొరకవు.

ఈ పరిస్థితి అన్నింటికన్నా ముందు జీవితానికి అవసరమైన ఆహారం విషయంలో కనబడుతుంది. అందునా విటమినులు, ఖనిజాల విషయంలో మరింత కొట్టవచ్చినట్లుంటుంది.

ఒక భవనాన్ని కట్టడానికి ఇటుకలు, సిమెంటు, ఊచలు, ఇతర పదార్థాలు అవసరం ఉన్నట్లే సమతుల ఆహారంలో కూడా రకరకాల వస్తువులు అవసరం. స్థూలంగా చెప్పాలంటే - మాంసకృత్తులు, చక్కెర పదార్థాలు, కొవ్వులు, విటమినులు, ఖనిజాలు, నీరు సరైన పాళ్ళలో కలిస్తేనే మంచి ఆహారం తయారవుతుంది. ఒక భవనాన్ని కడితే అది కలకాలం చెక్కుచెదరకుండా నిలుస్తుంది. కానీ మానవ శరీరం అలా కాదు. ఇది ఎప్పుడూ పని చేసే కర్మాగారం లాంటిది.

చిన్నచిన్న పరమాణువులు ఒకచోట చేరి అణువు రూపం దాలుస్తుంది. అలాగే మన శరీరం కూడా రకరకాల కణజాలం కలయిక వలన ఏర్పడుతుంది. మనకు తెలియకుండానే ఈ కణజాలాలు ఎప్పటికప్పుడు నాశనమవుతుంటాయి. కొత్తవి పుట్టుకొస్తుంటాయి. ఇలా నిరంతరాయంగా, నిర్విఘ్నంగా జరుగుతుంటే శరీరం సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటుంది. ఈ చర్యలో ఏ కారణంగానైనా ఎక్కడైనా లోపం జరిగితే అది అనారోగ్యం.

శరీరంలోని కణజాలాలను తిరిగి తయారు చేయడానికి అవసరమయ్యే కొన్ని పదార్థాలు, నాశనమైన కణజాలాల నుండి అందుతాయి. కానీ చాలామటుకు పదార్థాలు మాత్రం కొత్తగా, మన ఆహారం ద్వారా మాత్రమే అందుతాయి.

శరీరంలోని కణజాలాలను నాశనం చేయడం, తిరిగి నిర్మించడాన్ని జీవచర్య అంటారు. ఈ చర్యకు మన ఆహారానికి ప్రత్యక్ష సంబంధం ఉంది. శక్తి ఉత్పత్తికోసం జరిగే దహన క్రియను జీవచర్య అనుకుంటే, అందుకు అవసరమైన ముడి ఇంధనం ఆహారం. అందుకని జీవచర్య సక్రమంగా జరగాలంటే మంచి ఆహారం అవసరం. అవసరమైన అన్ని రకాల పదార్థాలు సరైన పాళ్ళలో శరీరానికి అందాలి. సరైన పాళ్ళు అనేవి పరిస్థితులను బట్టి మారతాయి. వీటిలో ఏ ఒక్క పదార్థం సరిగా అందకున్నా మొత్తం చర్య కుంటుపడే అవకాశం ఉంది.

విటమిన్‌లు - ఖనిజాలు

శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అవసరమయ్యే ఆహార పదార్థాలన్నింటిలోకి తక్కువగా అవసరమయ్యేవి విటమినులు, ఖనిజాలు! ఇవి రోజుకు ఒక మిల్లిగ్రాము కన్నా తక్కువ మాత్రమే అవసరం. ఒక్క 'సి' విటమిను మాత్రం 50 మి.గ్రా. దాకా కావలసి ఉంటుంది.

ఇంత తక్కువగా అవసరమయ్యే ఈ పదార్థాల మోతాదు ఏ కొంచెం తగ్గినా ఆరోగ్యం దెబ్బతింటుంది. అయితే మామూలుగా భోజనం చేసే వారెవరికి సాధారణంగా విటమిన్ లోపాలు రావు. వచ్చే కష్టమంతా సరైన ఆహారం సంపాదించుకోలేని వారికి, విచిత్రమైన ఆహారపు అలవాట్ల వల్ల ఎప్పుడూ ఒకేరకం తిండి తినేవారికి మాత్రమే!

ఎప్పుడు ఎంతెంత విటమినులు, ఖనిజాలు అవసరం అనేది మన శరీరానికే తెలుసు. ఈ సరఫరా తగ్గిన మరుక్షణం ఆ సంగతిని రకరకాల లక్షణాల ద్వారా శరీరమే బయటకు తెలియజేస్తుంది. ఈ విటమినులన్నీ మనకు బయట దొరుకుతాయి. తక్కువైన వాటిని తగిన మోతాదులో తీసుకుంటే సమస్య తీరుతుంది. వీటిని ఇంజెక్షన్ ద్వారా తీసుకున్నా, మాత్రల రూపంలో తీసుకున్నా ఫలితంలో మార్పు ఉండదు. రెండు రకాలుగా ఇవి బాగా పని చేస్తాయి. అయితే అవసరానికి మించి



పేదల ఆదాయ శాతం

2000 లెక్కల ప్రకారం పౌష్టికాహార లోపం గల ప్రజలు 24 శాతం. ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల వారిలో ఉండవలసినదానికంటే తక్కువ బరువుగల బాలలు 47 శాతం. తక్కువ ఎత్తుగల బాలలు 46 శాతం. తక్కువ బరువుతో జన్మిస్తున్న శిశువుల శాతం 26.

1997 సర్వే ప్రకారం భారత్‌లో ధనికుల, పేదల ఆదాయశాతాలు:

- పేదల్లో పేదలైన 10 శాతం ప్రజల ఆదాయం 3.5 శాతం.
- 20 శాతం మంది పేదల ఆదాయం 8.1 శాతం.
- కుబేరుల్లో కుబేరుల 10 శాతం మంది ఆదాయం 33.5 శాతం.
- 20 శాతం ధనవంతుల ఆదాయం 46.1 శాతం.
- 2001 లెక్కల ప్రకారం స్థూల జాతీయోత్పత్తిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల శాతం 0.7 మాత్రమే.
- 2001లో దేశ సైనిక వ్యయం స్థూల జాతీయోత్పత్తిలో 2.5 శాతం.
- స్థూల జాతీయోత్పత్తిలో రుణ చెల్లింపుల శాతం 1.9 శాతం.

విటమినులు తీసుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. పైగా నష్టం జరగవచ్చు. శరీరం సరిగా ఆరోగ్యంగా ఉంటే అదనంగా తీసుకున్న విటమినులను మలమూత్రాల ద్వారా బయటకు పంపించగలుగుతుంది. కొన్నిసార్లు మాత్రం ఎక్కువ విటమినులు శరీరంలో చేరి కష్టాలను తెస్తాయి. ముఖ్యంగా విటమిన్ ఏ, డిల విషయంలో.

ఈ ప్రపంచంలో డబ్బుగల వారంతా అవనవసరంగా రోజూ విటమిన్‌లు, ఖనిజాలు తీసుకుని వాటిని పెంటపాలు చేస్తుంటారు. అవి నిజానికి వారికి అనవసరం. ఈ విటమినులు సర్వరోగ నివారకాలని కొందరి అభిప్రాయం. అయితే ఇవి ఏ మాత్రం నిజం కాదు.

సమతుల్యం పాటించాలి

◆ విటమినులచే రసాయనాలను శరీరం స్వంతంగా తయారు చేసుకోలేదు. కానీ అవి లేకుండా గడవదు కాబట్టి మనం వాటిని శరీరానికి అందించాలి.

◆ ఈ పదార్థాలు మనకు చాలా తక్కువ మోతాదులోనే అవసరం.

◆ ప్రతి ఆహార పదార్థంలోనూ ఇవి అన్నో కొన్నో ఉండనే ఉంటాయి. కొన్నిట్లో ఒక రకం విటమిను చాలా ఎక్కువగా ఉంటుంది. మరికొన్ని రకాలు లేకనేపోవచ్చు. సరైన ఆహారం తీసుకోదలుచుకున్నప్పుడు ఎందులో ఏ రకమైన విటమినులు, ఖనిజాలు ఉంటాయని తప్పకుండా తెలుసుకోవాలి.

◆ ఆహారం సరిగా అందుబాటులో లేనివారికి తప్ప, మామూలు భోజనం తీసుకుంటున్న వారికందరికీ ఇవి దొరుకుతుంటాయి. అందుకని వీటిని మందుల రూపంగా తీసుకోనవసరం లేదు.

◆ అనారోగ్యంగా ఉన్నప్పుడు ఈ మందులు పని చేస్తాయి. అంతేగాని ఆహారంలో ఉండే విటమినుల కన్నా ఇవి ఏ రకంగానూ గొప్పవి కావు.

◆ చక్కెర పదార్థాలు, కొవ్వులు అదనంగా తీసుకుంటే శరీరంలో నిలువ ఉంటాయి. విటమినులు, ఖనిజాలకు మాత్రం అలాంటి వీలులేదు. అదనంగా తీసుకున్నా ఇవి వ్యర్థమవుతాయే తప్ప ఏ విధంగానూ మనకు సహాయ పడలేదు.

◆ ఒక్కొక్క విటమిను లోపం వల్ల ప్రత్యేకమైన అనారోగ్య లక్షణాలు వస్తాయి. ఆ విటమినుతోనే ఆ లక్షణాన్ని సరిచేయవలసి ఉంది. అనారోగ్యం తగ్గిన వెంటనే విటమినులు తీసుకోవడం మానాలి. రాబోయే అనారోగ్యానికి ముందే విటమిను తీసుకొనడం వలన ఎటువంటి ప్రయోజనం ఉండదు.

పోషకాహార వారోత్సవాలు



మనం తీసుకునే ఆహారంలో ఎటువంటి పోషక విలువలు ఉండాలి. ఎలాంటి ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామనే విషయంపై ప్రతి సంవత్సరం పోషక ఆహార విలువల వారోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ మొదటి వారాన్ని మన ప్రభుత్వం పౌష్టికాహార వారోత్సవంగా నిర్వహించి ఆహార పదార్థాలలోని పోషక విలువల గురించి ప్రచారం చేస్తుంది. ఈ వారోత్సవాలను మొదట 1982 సంవత్సరం సెప్టెంబర్‌లో ప్రారంభించారు.

మన దేశంలో పోషక ఆహారలోపమనేది పెద్ద సమస్య. అందుకే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి సమతుల్య ఆహారాన్ని ప్రజలందరికీ అందించేందుకు కొంత బడ్జెట్‌ను కేటాయిస్తున్నారు. మన దేశం పేద దేశం కావటంతో అందరికీ సమతుల ఆహారం అందించటంలో మన ప్రభుత్వాలు విఫలమవుతూ వస్తున్నాయి. దాంతో ప్రజలు అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారు.

శిశు మరణాల్లో మనమే ఫస్ట్

శిశు మరణాలు, బాలింతల మరణాలు మనదేశంలో ఎక్కువేనని ఐరాస నివేదిక పేర్కొంది. భారత్‌లో శిశు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్న 11 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసన ఉండటం విశేషం. ప్రపంచబ్యాంక్ వద్ద అప్పుతెచ్చి ఆస్పత్రులు కట్టించి, కమిటీలు వేసి నానా హడావిడీ చేసినా వైద్య, ఆరోగ్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ స్థితి ఎంత అధమంగా ఉందో ఐరాస వివరించింది. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన విషజ్వరాల మరణాలు చూస్తే ఈ నివేదిక ఎంత నిక్కచ్చిగా

తయారైందో తెలుస్తోంది. విద్య, వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ వెనుకబడినట్లు నివేదికలో స్పష్టంగా ఉంది. వైద్యం విషయంలో కేరళ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా ఉన్నట్లు ఐరాస నివేదిక పేర్కొంది. హైటెక్ ముఖ్యమంత్రిగా ప్రపంచబ్యాంక్, అమెరికా అధ్యక్షుల వారి ప్రశంసలు, పారిశ్రామికవేత్తల నుండి అవార్డులు అందుకున్న చంద్రబాబు గారి పాలనలోని రాష్ట్రం ఏ విషయంలోనూ ఐరాస నుండి సానుకూల గుర్తింపు పొందలేదు.

వైద్య రంగంపై చైనా 2.1 శాతం ఖర్చు చేస్తుండగా భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 1.3 శాతం ఖర్చు చేస్తున్నాయి. శిశు మరణాలు చైనాలో వెయ్యికి 32 కాగా భారత్‌లో 67 సంభవిస్తున్నాయి. ఐదేళ్ళలోపు బాలల్లో చైనాలో వెయ్యికి 40 మంది మృతి చెందుతుండగా మన దేశంలో 93 మంది చనిపోతున్నారు.

గర్భవతులు ఎలాంటి ఆహారం తీసుకోవాలి -

శరీర ధర్మ వరంగా, పోషకాహారపరంగా గర్భంతో వున్న స్త్రీలు ఎక్కువ ఆహారం తీసుకోవాలి. వీరు తమ శరీరంలో కొవ్వునిల్వలను పెంచుకోవాలి. ఇవి శిశువుకు అవసరమయ్యే పోషకాలను అందిస్తాయి. ప్రసవం తరువాత పాల ఉత్పత్తి ఎక్కువగా ఉండేందుకుగాను ఇనుము ధాతువులు గల పదార్థాలు ఎక్కువగా తినాలి. ఈ మూలకం వలన హిమోగ్లోబిన్ ఎక్కువగా ఏర్పడుతుంది. మానసిక క్రియలకు, శారీరక రక్షణకు ఇనుము ఎంతో ఉపయోగపడుతుంది. గర్భస్థ దశలో ఇనుము లోపం కారణంగా శిశువులు, తల్లి ఇద్దరూ మరణించే ప్రమాదం ఉంది. అందుకే వీటిని సమపాళ్ళలో తీసుకోవాలి.



ఇనుము ఎక్కువగా పప్పులు, గోంగూర, ఆకుకూరలు, ఎండిన పండ్లు, మాంసం, చేపలు, కాలేయం, ఉసిరి, జామ, నారింజ వంటి పదార్థాలలో ఉంటుంది. అలాగే ఫొలేట్ పుష్కలంగా వున్న పదార్థాలను కూడా ఎక్కువగా తినాలి. డాక్టర్ల పరిశీలన ప్రకారం గర్భం దాల్చిన మొదటి నెల నుండి తొమ్మిదో నెల వరకూ ఫోలిక్ యాసిడ్ ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ పదార్థం తీసుకోవటం వలన నెలలు నిండకముందే పుట్టే బిడ్డలను తగ్గించి, బరువుగా ఆరోగ్యంగా ఉండే శిశువులను అందించవచ్చు. ఇందుకుగాను పాలు, గుడ్డు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. గింజ ధాన్యాలు, మొలకెత్తిన గింజలను బాగా తినాలి. పులియబెట్టిన ఆహారం, ఎండిన పండ్లు సమపాళ్ళలో తీసుకోవాలి. మద్యం, పొగాకు వంటి మారక ద్రవ్యాలు అసలే వాడకూడదు. అనవసరపు మందులు కూడా తీసుకోవడం మంచిది కాదు. ప్రతి 15 రోజులకొకసారి సమీపంలోని డాక్టర్లని సంప్రదించి వారి సూచనలు పాటించాలి.

ఆనందకరమైన జీవితం కోసం కొన్ని సూత్రాలు

◆ శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలకు మించిన ఔషధం లేదు. ప్రసవం అయిన కొన్ని నిమిషాల నుండి తల్లిపాలను పట్టవచ్చు.

◆ డైటింగ్ పేరుతో వేలకువేలు పోసి అనవసరపు ట్రీట్‌మెంట్‌లు తీసుకోవడం ప్రమాదకరం. ఆహారం అధికంగా తీసుకోవటం ఎంత ప్రమాదమో, తగ్గించి తీసుకోవడం కూడా అంతే ప్రమాదం.

◆ విటమిన్-ఎ ఎక్కువగా ఉన్న పదార్థాలు తీసుకోవాలి. తాజా కూరగాయలు, ఆకుకూరలు, క్యారెట్, బొప్పాయి వంటి వాటిలో ఇవి ఎక్కువగా ఉంటాయి.

◆ పచ్చికాయలు ఎక్కువగా తినాలి. బాగా ఉడికించినవి, నానబెట్టిన పదార్థాలు బాగా తీసుకోవాలి. ఇవి జీర్ణశక్తిని పెంచుతాయి.

◆ తీసుకునే ఆహారంలో కొవ్వులు, నూనెలు తక్కువగా ఉండేలా జాగ్రత్త వహించాలి. ఇవి తిన్నప్పుడు కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. కానీ ఇది చాలా ప్రమాదం.

◆ ఉప్పును పరిమితంగా వాడాలి. అయోడిన్ పరిమాణం సరిపడేలా ఉన్న సాల్ట్‌ను మాత్రమే వాడాలి. ●

పనిని బట్టి ఆహారం

వ్యక్తుల యొక్క రోజువారీ దినచర్యలను బట్టి శారీరక ధర్మాలను బట్టి వారికి రోజుకు ఎంతమేరకు పోషక పదార్థాలు అవసరమవుతాయి. ఏ ఏ పదార్థాలలో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయనే విషయంపై 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్' (జాతీయ పోషకాహార సంస్థ) పరిశోధనలను చేసింది. సమాజంలోని మనుషులను మూడు వర్గాలుగా విభజించి వారికి కావాల్సిన పోషక విలువల వివరాలను వారు సూచించారు.

1. తేలికపాటి పని చేసే వారు.
2. ఓ మోస్తరు పని చేసేవారు.
3. ఎక్కువ కష్టం చేసే వారు.

తేలికపాటి పని చేసేవారు

ఆహార పదార్థం పేరు	గ్రాములలో పురుషుడు	గ్రాములలో స్త్రీ
1. గింజపదార్థాలు	420	300
2. పప్పులు	60	60
3. పాలు (మి.లీ.)	300	300
4. దుంపలు & గడ్డలు	200	100
5. ఆకుకూరలు	100	100
6. ఇతర కూరగాయలు	100	100
7. పళ్ళు	100	100
8. చక్కెర	25	20
9. కొవ్వులు	20	20

ఓ మోస్తరు పని చేసే వారు

ఆహార పదార్థం పేరు	గ్రాములలో పురుషుడు	గ్రాములలో స్త్రీ
1. గింజపదార్థాలు	480	360
2. పప్పులు	90	75
3. పాలు (మి.లీ.)	300	300
4. దుంపలు & గడ్డలు	200	100
5. ఆకుకూరలు	100	100
6. ఇతర కూరగాయలు	100	100
7. పళ్ళు	100	100
8. చక్కెర	40	22
9. కొవ్వులు	35	30

ఎక్కువ కష్టం చేసే వారు

ఆహార పదార్థం పేరు	గ్రాములలో పురుషుడు	గ్రాములలో స్త్రీ
1. గింజపదార్థాలు	690	480
2. పప్పులు	90	90
3. పాలు (మి.లీ.)	300	300
4. దుంపలు & గడ్డలు	200	100
5. ఆకుకూరలు	100	100
6. ఇతర కూరగాయలు	100	100
7. పళ్ళు	100	100
8. చక్కెర	55	45
9. కొవ్వులు	55	40

పిల్లలైతే

ఆహార పదార్థం పేరు	గ్రాములలో 6-12 నెలలు	గ్రాములలో 1-3 సం॥లు	గ్రాములలో 4-6 సం॥లు
1. గింజపదార్థాలు	45	120	210
2. పప్పులు	15	30	45
3. పాలు (మి.లీ.)	500	500	500
4. దుంపలు & గడ్డలు	50	50	100
5. ఆకుకూరలు	25	50	50
6. ఇతర కూరగాయలు	25	50	50
7. పళ్ళు	100	100	100
8. చక్కెర	25	25	30
9. కొవ్వులు	10	20	25

అంపశయ్య నవీన్

దేశం బాగుపడాల్నంటే...

"ఈ దేశం బాగుపడ్తదంటవా?"

"దేశం బాగును గురించి ఆలోచించేటోడు తెలివి తక్కువోడని నా ఉద్దేశం... నీ బాగును గురించి ఆలోచించు... నువ్వు బాగుపడ్తే దేశం బాగుపడ్డట్టేననుకో..."

"వెనకటికో పెద్దమనిషి దేశం నీకేమిచ్చిందని కాదు, నువ్వు దేశానికేమిచ్చినవని ఆలోచించమన్నాడని ఎక్కడ్నో చదివిన..."

"పెద్ద మనుషులు అట్లనే చెప్తరు... తనకు మించిన ధర్మం లేదని కూడా పెద్ద మనుషులే చెప్పింద్రులే..."

"నా అసలు ప్రశ్నకు నువ్వు జవాబు చెప్తనే లేవు"

"నీ ప్రశ్నేంది? మల్లోసారి చెప్పు..."

"దేశం బాగుపడ్తదా అని అడిగినా... దేశం బాగు సంగతి వదిలి పెట్టు. నీ బాగును గురించి ఆలోచించు అన్నవు. పోనీయ్ నేనన్నా బాగుపడ్తనంటవా?"

"అసలు బాగుపడటమంటేంది?"

"చేతి నిండా డబ్బు లుండటవేం బాగుపడుడంటే...."

"డబ్బులుంటే బాగు పడ్డట్టేనా? నా చేతినిండా డబ్బులున్నయి.. నేను బాగుపడ్డోన్నంటవా?"

"అంతే మల్ల"

"డబ్బులుండంగనే బాగుపడ్డట్టా? దేశంల అందరి దగ్గర డబ్బులు పుష్కలంగుంటయి... కాని బజారుకుపోతే ఏ వస్తువు దొరకదు.. బియ్యం, పప్పు, ఉప్పు... ఇట్లాంటివేవీ దొరుకుతలేవనుకో... అప్పుడు నువ్వుగానీ, దేశంగానీ బాగుపడ్డట్టా?"

"గదంత నాకు తెల్వది గాని పోనీయ్ బాగు పడటమంటేందో నువ్వే చెప్పి పుణ్యం కట్టుకో...

"బాగుపడుడంటే ఏ రకంగా బాగుపడటం? ఆర్థికంగానా? సామాజికంగానా? సాంస్కృతికంగానా? రాజకీయంగానా? లేక మానసికంగానా?"

"బాగు పడుడంటే గిన్నుంటయని నాకు తెల్వదన్నా!..."

"నీకేం తెలుసునని బాగుపడుడు గురించి ఆలోచిస్తున్నవు..."

"నాకేమీ తెల్వదన్నా... తప్పయిపోయింది. మల్లోసారి నిన్ను ప్రశ్నలడగ జర నన్నొదిలిపెట్టు..."

"అట్లెట్ల వదిలి పెడత... బాగుపడుడు సంగతి తేల్చుకున్నంకనే వదిలిపెడ్త... నిజం చెప్పాల్నంటే ఈ ప్రపంచంల ఎవ్వడూ బాగుపడడు... ఎవనికుండే కష్టాలు వానికుంటాయి.... ఆర్థికంగా బాగుపడ్డోనికి మానసిక సమస్యలుంటాయి.. రాజకీయంగా బాగుపడ్డోనికి సాంస్కృతిక సమస్యలుంటాయి.... సామాజికంగా బాగుపడ్డోనికి ఆర్థిక సమస్యలుంటాయి. దేశం కూడా గంతే.. ఏ దేశ సమస్యలు తీరినా మన దేశ సమస్యలు అస్సలే తీరయి"

"నాకంత గందరగోళంగుంది. నాకేం సమఝయిత లేదు - జర సమఝయిటట్టు చెప్పు"



"అసలు సమఝుగావడమంటేంది? ఏది ఎవరికి పూర్తిగా సమఝుగాదన్న సంగతి నీకెరికేనా?"

"ఎరుకలేదు..."

"ఖగోళ శాస్త్రజ్ఞులు మనకు ఫలానా నక్షత్రం ఇన్ని లక్షల లైట్ ఇయర్స్ దూరంలో ఉందంటరు... "లైట్ ఇయర్" అంటేందో నీకెరికేనా?"

"ఎరికే..."

"ఏందో చెప్పు..."

"ఒక సంవత్సర కాలంలో లైట్ ఎంతదూరం ప్రయాణం చేస్తదో అంతదూరం..."

"లైట్ అంటే కాంతి ఒక సెకండుకే ఒక లక్షా ఎనభై నాలుగు వేల మైళ్ళు ప్రయాణం చేస్తదట. అప్పుడా కాంతి ఒక నిమిషానికెంత దూరం పోతది?. ఒక గంటకెంత దూరం పోతది? ఒక రోజుకెంత దూరం పోతది?.. ఒక నెలకెంత దూరం పోతది? ఒక సంవత్సరానికెంత దూరం పోతది?... దీన్ని ఊహించుకోగల్గతవా?"

"దేశం బాగుపడ్తదా అని అడిగినందుకు గియ్యన్ని చెప్తున్నవేంది? దానికి దీనికి ఏం సంబంధం?"

"చాలా సంబంధం ఉంది"

"అదేందో జర్ర చెప్పు..."

దేశం బాగుపడుడుగానీ, నువ్వు బాగుపడుడుగానీ కొన్ని కాంతి సంవత్సరాల దూరం ఉంది.."

"గట్లెందుకంటున్నవు.."

"అంతేమరి... దేశం బాగుపడాల్నంటే కాశ్మీరు సమస్య పరిష్కారం గావాలె... అదిప్పుడయితదనుకుంటునవా? నువ్వు నేను గారోజు చూస్తమనుకుంటానవా?... దేశం బాగుపడాల్నంటే కుల మతాలు పోవాలె... ఉన్నోనికి లేనోనికి మధ్య ఉండే తేడాలు పోవాలె... అయ్యిప్పుడు పోతాయనుకుంటానవా? దేశం బాగుపడాల్నంటే ప్రాంతీయ అసమానతలు పోవాలె... నదీజలాలను గురించి ఒక రాష్ట్రానికి ఇంకో రాష్ట్రానికి మధ్య ఉన్న పంచాయతీలు పోవాలె. అవిప్పుడు పోతయా? దేశం బాగుపడాల్నంటే వరకట్నపు చావులు పోవాలె... స్త్రీలను మగవాడి సెక్స్‌ను తృప్తిపరచే వస్తువులుగా చూసే మగవాడి మనస్తత్వం మారాలె... దేశం బాగుపడాల్నంటే ఎం.ఎల్.ఏ. కావడానికో, ఎం.పి. కావడానికో కోట్లకు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే పరిస్థితి పోవాలె... ఖర్చు పెట్టిన పైసలన్నీ మల్ల రాబట్టుకోవాల్ననే రాజకీయ నాయకుల మనస్తత్వం మారాలె... అదిప్పుడు జరుగుతదా? దేశం బాగుపడాల్నంటే ప్రజాస్వామ్యమంటే అందరికీ ఓటుహక్కు మాత్రమే అనుకునే మనస్తత్వం మారాలి.. ప్రజాస్వామ్యమనేది రాజకీయాలకే పరిమితం కాకుండా అది ప్రజలందరి జీవన విధానంగా మారాలె... అదిప్పుడు జరుగుతదా? కాబట్టి బాగుపడుడనేది కొన్ని లైట్ ఇయర్ల దూరంలో ఉన్నదని అర్థం చేసుకో... దాన్ని గురించి ఆలోచించి బుర్రచెడగొట్టుకోకు... సమజయిందా?"

"సమజయిందన్నా... పొయ్యొస్త..."

"మల్లవారం మల్లో ప్రశ్న పట్టుకొనిరా..."

"వస్త"

గురువు

సమాజానికి మూలస్తంభంగా
విద్యార్థి లోకానికి జ్ఞానదీపంగా
చిరునవ్వుల్లో వెన్నెలలను మిళాయించి
పలుకుల్లో సుధలను వర్షించే
కారుణ్యమూర్తి గురుదేవుడు
సమతకు నవతకు అతడే ప్రతినిధి
రాగద్వేషాలకు అతీతమైన
మమతకు అతడే పెన్నిధి
మౌఢ్యాన్ని ఖండించి
ధీశక్తిని వెలిగించి - విద్యార్థిని
క్రాంతి బాటలో నడిపిస్తాడు
దానవత్వాన్ని తెగటార్చి
మానవత్వాన్ని పండించి
సమాజాన్ని కొత్త కోణంలో నిర్వచిస్తాడు
ప్రేమతో శిష్యులను అక్కున చేర్చుకొని
అమ్మలా ఆదరించే
కమనీయ మనస్కుడు గురువు
గురువులేని బ్రతుకు తీర్చలేని బరువు
అందుకే
గురుమూర్తి పదాంబుజాలను
పూజించడానికి శిష్యలోకం
ఆయత్తమైంది
సర్వేపల్లి సాక్షిగా రేపటి తరాన్ని
మేధోమయం చేయడానికి
(సెప్టెంబర్ 5, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా)

- మంకుశ్రీను

గొర్రె తోక బెత్తెడే...!

ముడిచిన మెట్ట ముక్కున కమ్మి
పాలె మొలతాడు బద్దల గిడుగు
గొర్రెల మందలో వాడో గొర్రె కలసిపోతాడు.

ఆకాశాన్ని పచ్చడం చేసి
బరికమ్మ పరుపు మీద దొర్లి దొర్లి
పోగేసిన పింఢ్రికల పెంట లోంచి
తొలి పొద్దుకు ఆహ్వానం పలుకుతాడు.
మట్టి బెడ్డల పొయ్యి పొక్కళ్ళ మీద ఎసరై మరిగి
దాంగ్రలో చల్లారిన చెమటను
అంకుడు దొన్నలో జావ చేసి తాగుతాడు.
రాత్రంతా... కంటి మీద కునుకుపిట్టను
వాలకుండా చేసి
మంద చుట్టూ ప్రాణాలు కంచెలా పాతిన కోనారి,
ఆకాశానికి దాపేసి రెక్కల దొనిగర్రతో
మబ్బుల్ని తెంపి మందకు మేతేస్తాడు.
ఎండముల్లు గుచ్చుకుంటున్నా
శీతగాలి కమ్మకత్తై కోతపెడుతున్నా
మందసారాన్ని మట్టి తల్లికి అందిస్తాడు.
బగాది పెట్టి పిడుగులు పడుతున్నా
కప్పుకున్న తట్టకమ్మ లోంచి
నీటిమొక్కై మొలుచుకొస్తాడు.

కళ్ళం పెండిని మంద మేసిందని
నాయుడు కొట్టిన కొరడా దెబ్బలకి
కన్పించే చుక్కల్ని కళ్ళంట రాల్చుకున్న
ఎర్రిబాగులోడు.
మేకల మందతో మన్నెంకని అడివి పట్టేసి
యిటికీ పున్నమికి ఏడాదైనా
పిక్కురోడు మీద దేల పోయినపుడు
గొర్రెపిల్లను చంకనెత్తుకుంటాడు.
టిర్... టిర్... అంటూ పగలంతా
నాయుడోరి పొలాల మీద మందాసి
పొద్దువాలాక ముత్తుంగింజల బత్తెం కోసం
వాళ్ల మునివాకిట పడిగాపులు పడితే
గావంచాన రాలేవి మూడు సోలల గింజలు.
వాళ్ళ పండగ పబ్బాల్లో
గుండెను తప్పెట గుళ్ళు చేసి ఎంతబాదుకున్నా
గొల్లోడి బతుకు గొర్రెతోక బెత్తెడే!
మాయదారి రోగమేదో మబ్బై ముసిరి
మందను మింగేస్తే...
వాడిపుడు, ఓ తప్పిపోయిన గొర్రెపిల్లై
తల్లడిల్లుతున్నాడు.

- చిరికి స్వామినాయుడు

* పుప్పాల కృష్ణమూర్తి

పిల్లల్ని తరచూ స్కూళ్ళు మార్చకండి

స్కూలు కెళదామని బస్టాప్‌లో వెయిట్ చేస్తుంటే సైకిల్ మీద హడావిడిగా వెళ్తున్నాడు నా దోస్తు రవీందర్.

"ఎక్కడికిరా" అని పలకరించాను.

"ఆ ప్రకాష్‌గాడికి బాగా టెక్కు పెరిగిపోయిందిరా వాళ్ళ స్కూల్‌కు స్టేట్ ర్యాంకోటి వచ్చేసరికి. కనీసం వెయ్యి కూడా ఫీజు తగ్గియ్యనన్నాడు." సైకిల్ దిగకుండానే అన్నాడు కోపంగా.

"అయితే ఏంటి? తగాదాకు వెళ్తున్నావా?" అన్నాను.

"ఆ సీను నిన్ననే అయిపోయింది. ఇవ్వాళ్ళ టి.సి. కోసం వెళ్తున్నాను. నన్ను లెక్క చేయని వాడి స్కూల్లో నా పిల్లల్ని చదివించే సమస్యే లేదు." అన్నాడు ఖరాఖండిగా.

"అదేంట్రా? పిల్లలు చక్కగా చదువుకొంటున్నారని వారం కింద చెప్పావు. మీరేదో తగాదా పడి పిల్లల్ని డిస్టర్బ్ చెయ్యడమెందుకు చెప్పు?" అన్నాను.

"నీకేం తెలీదు లేరా. వాడు స్కూలు పెట్టేప్పుడు మనమెంత సాయం చేశాము. తన స్కూలు తప్ప మన పిల్లలకు వేరే గతిలేదనుకొంటున్నాడు. అదీ చూస్తా! ఎవరినీ లెక్క చేయడం లేదు. అందుకే నవీన్ చీలి మరో స్కూలు పెడుతున్నాడు. కేరళ టీచర్లను కూడా తీసుకొస్తున్నాడు. మన గైడెన్స్ చాలా ఉంది. అదే పని మీద వెళ్తున్నాను. వస్తా.." అని వెళ్లిపోయాడు.

పిల్లల్ని స్కూలెందుకు మారుస్తారని ఆలోచిస్తే మొదటిది ప్రస్తుతం చదువుతున్న స్కూలు కంటే మెరుగైన విద్యనందించే స్కూలులో చేర్చాలనుకున్నప్పుడు. రెండవది తల్లిదండ్రులు వ్యాపార రీత్యానో, ఉద్యోగ బదిలీ రీత్యానో ఒక ప్రదేశం నుంచి మరో ఊరుకు వెళ్లిపోయినప్పుడు. మూడవది ఇతర కారణాలు. స్కూలు ఇంటికి దూరమైందనో, బస్సు సౌకర్యం లేదనో, రవీందర్ చెప్పిన వ్యక్తిగత కారణాలో ఉంటాయి. కారణాలు ఏవైనా విద్యా సంవత్సరం మధ్యలో స్కూలు మార్చడం అసలు మంచి పద్ధతి కాదు.

సాధారణంగా పిల్లల్ని స్కూల్లో చేర్చేటప్పుడే బాగా ఆలోచించి చేస్తాం. మన ఆర్థిక స్థితి, స్కూలు ఫీజులు, టీచర్ల స్థితి, మీడియం, స్టేట్ సిలబస్సా లేక సెంట్రలా ఇలా అనేక అంశాల్ని పరిశీలించుకున్నాకే మన ఇష్ట ప్రకారం ఉజ్వల భవిష్యత్తునాసించి మనకు మంచి అనిపించిన స్కూల్లో చేరుస్తాము. పిల్లలకు క్రమేపీ స్కూలు వాతావరణం అలవాటవుతుంది. ఫ్రెండ్స్ ఏర్పడతారు. టీచర్ల సైకాలజీ పిల్లలకు, పిల్లల స్టాండర్డ్ టీచర్లకు తెలిసిపోతుంది. పరస్పర అనుబంధం ఏర్పడుతుంది. ఒకరిపై ఒకరికి గౌరవం, ప్రేమ ఏర్పడుతుంది. పిల్లల గురించిన సంపూర్ణ అవగాహన ఏర్పడి, ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో, వాటి పట్ల ఎలా శ్రద్ధ తీసుకోవాలో టీచర్ గ్రహిస్తాడు. తల్లిదండ్రుల్ని కూడా ఆయా సబ్జెక్టుల్లో శ్రద్ధ పెట్టమని డైరీలో సూచనలిస్తుంటారు. పేరెంట్స్ తమ పిల్లల గురించి ఎప్పుడడిగినా సంపూర్ణ అవగాహనతో ఉంటారు. గనుక ఎందుకు వెనుకబడ్డాడు, సబ్జెక్టు మెరుగుదలకు ఏం చేయాలి? అనే విషయాన్ని టీచర్లు వెంటనే చెప్పగలుగుతారు. ఇలా అవగాహన, అనుబంధం ఏర్పడ్డాక విద్యార్థి పూర్తిగా తన చదువులో మునిగిపోయి లక్ష్యం వైపు సాగిపోతాడు. ఇలాంటి పరిస్థితుల్లో పాఠశాల మారిస్తే అనేక ఇబ్బందులు ఎదుర్కొన వలసి వస్తుంది.

స్నేహితులు, ఉపాధ్యాయులు, స్కూలు వాతావరనం మారడం వల్ల ఒంటరితనం ఫీలై ఏకాగ్రత దెబ్బతింటుంది. కొత్త పిల్లల స్టాండర్డ్ టీచర్లకు, టీచర్ల గురించి విద్యార్థులకు కొంతకాలం పాటు తెలియదు. ఇందువల్ల పరస్పర అవగాహన కొరవడి చదువుకు ఇబ్బంది ఏర్పడుతుంది. స్కూలు మారినప్పుడల్లా డ్రెస్ మర్చాల్సి వస్తుంది. అలాగే పుస్తకాలు, నోటు పుస్తకాలు, డొనేషన్ వగైరా వలన అదనపు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడతాయి. మరో అంశం ఏమంటే గతంలో పిల్లలు స్కూలు బస్‌లో లేదా ప్రభుత్వ బస్‌లో వెళ్లి వస్తే, ప్రస్తుతం కూడా అలాంటి సౌకర్యం ఉంటే ఫరవాలేదు. లేకుంటే పిల్లలకు ఇబ్బందులు కలుగుతాయి.

తప్పనిసరిగా స్కూలు మార్చాల్సి వస్తే కొన్ని అంశాల పట్ల శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. ప్రచారార్భాటానికి మోసపోక బోధన ఎలా ఉందో ముందుగా అక్కడ అప్పటికే చదువుతున్న పిల్లల్ని అడిగి తెలుసుకోవాలి.

వీటితోపాటు మరో ముఖ్య విషయం కూడా గమనించాలి. మీ పిల్లలు ఏడవ లేక పదవ తరగతి చదువుతూ ఉంటే కొత్త స్కూల్‌లో టెస్టు రాసి సెలెక్టు అయితేనే టి.సి. తీసుకోవాలి. ఇలాంటి సాదకబాదకాలు అనేకం ఉంటాయి గనుక పిల్లల్ని స్కూలు మార్చేటప్పుడు సరైన ప్లానుతో, ఆలోచనతో మార్చాలి. కానీ మన వ్యక్తిగత కారణాలతో ఆవేశపడి పిల్లల్ని తరచుగా మీడియం, స్కూలు మార్చడం అంత మంచిది కాదు. ●

* ఎస్. నరేష్‌కుమార్

బాలలకథ

చెరపకురా చెడేవు

అనగనగా ఒక ఊరిలో ఓ రైతు వుండేవాడు. అతనికి ఇద్దరు కుమారులు. పెద్దవాడి పేరు రమేష్, చిన్నవాడి పేరు మహేష్. వృద్ధుడైన రైతు తన చివరి క్షణాల్లో కొడుకులిద్దరినీ పిలిపించాడు. 'మీరు గొడవలు పడకుండా కలిసిమెలసి వుండండి నాయనా' అని చెప్పి చనిపోయాడు. ఆ తర్వాత కొద్దిరోజులకే అప్పటివరకు వున్న ఇంటిని పడగొట్టారు. ఆ స్థలంలో చెరో ఇల్లు కట్టుకున్నారు. ఇంకా ఉమ్మడి ఆస్థిగా ఒక కోడిపెట్ట, కుక్క మిగిలాయి.

'గుడ్లు పెట్టే కోడిని సొంతం చేసుకున్నానంటే ఎంచక్కా అది రోజూ గుడ్లు పెడుతుంది. వాటిని అమ్ముకుంటే హాయిగా రోజులు గడపొచ్చు' అనుకున్నాడు రమేష్. వెంటనే తమ్ముడు మహేష్‌ను పిలిచి 'ఒరేయ్ తమ్ముడూ! ఆస్తులు పంచుకునే విషయంలో గొడవలు పడవద్దని నాన్నగారు చెప్పారు. కనుక ఈ పెంపుడు కుక్కను నువ్వు తీసుకో. కోడిపెట్టను మాత్రం నాకొదిలెయ్' అన్నాడు. అన్నగారి మాటకు ఏ మాత్రం ఎదురు చెప్పకుండా తన వాటాగా వచ్చిన కుక్కను వెంట బెట్టుకుని గుడిసెలోకి వెళ్లిపోయాడు మహేష్.

రమేష్ మరునాటినుంచే కోడి గుడ్లు అమ్ముకుంటూ డబ్బులు సంపాదించసాగాడు. తనతోపాటు తన కుక్కను ఎలా పోషించాలో అర్థంకాక అయోమయంలో పడ్డాడు మహేష్. రాత్రంతా బాగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకున్నాడు. ఉదయాన్నే కుక్కను తీసుకుని పక్కనే వున్న అడవికి వెళ్లాడు. దాని సాయంతో ఒక దుప్పిని చంపాడు. దాన్ని మార్కెట్‌లో అమ్మి డబ్బులు సంపాదించాడు. కుక్కకు ఎన్నో విద్యలు నేర్పాడు. అప్పటినుంచి అడవిలోని కుందేళ్లను ప్రాణాలతో పట్టి తెచ్చేది. వాటిని ధనవంతులకు అమ్మి మరిన్ని డబ్బులు సంపాదించేవాడు.

తనకంటే తన తమ్ముడు ఎక్కువ డబ్బులు సంపాదిస్తున్నాడనే అసూయతో తమ్ముడి కుక్కను చంపాలని నిశ్చయించుకున్నాడు రమేష్. మహేష్ లేనిసమయంలో విషం కలిపిన అన్నం పెట్టాడు. కుక్క చాలా తెలివైనది కనుక రమేష్ చూస్తున్నంతసేపూ అన్నం తింటున్నట్టు నటించింది. అతను వెళ్లగానే తినడం మానేసింది. ఇంతలో రమేష్ కోడి అటుగా వచ్చింది. శుభ్రంగా తినేసింది.

మరునటిరోజు ఉదయాన్నే కుక్క చనిపోయి వుంటుందని భావించి తమ్ముడింటికి వెళ్లాడు రమేష్. కాని కుక్క హాయిగా గంతులు వేస్తూ కనిపించేసరికి ఆశ్చర్యపోయాడు. ఏం జరిగిందో తెలీక ఆలోచనలో పడ్డాడు. తర్వాత గంపకింద చచ్చిపడివున్న తన కోడిని చూసి కుప్పకూలిపోయాడు. విషం కలిపిన అన్నం కుక్క తినకుండా కోడి తిన్నదని తెలుసుకుంటాడు. అందుకేనేమో పెద్దలు 'చెరపకురా చెడేవు' అంటారనుకున్నాడు. ●



క్విజ్-73

1. రెడ్‌లైట్ దేనికి చిహ్నము?
   ఎ.ప్రమాదము బి. శాంతి
2. 'మేఘసందేశము' రచయిత ఎవరు?
   ఎ.కాళిదాసు బి. అల్లసాని పెద్దన
3. క్యూబా రాజధాని?
   ఎ. హవానా బి. హిస్పనియోల
4. రబ్బరు చెట్లు అధికంగా వున్న ప్రాంతము?
   ఎ.కర్నాటక బి. కేరళ
5. గొప్ప శిల్పి, చిత్రకారుడు?
   ఎ. మైకేలాంజెలో బి. మైకేల్ జాక్సన్
6. ఐక్యరాజ్యసమితిలోని ప్రధాన అంగములు?
   ఎ.6 బి.5
7. మౌర్యులలో గొప్ప చక్రవర్తి?
   ఎ.చంద్రగుప్తుడు బి.అశోకుడు
8. ఏకకణజీవికి ఉదాహరణ?
   ఎ.హైడ్రా
   బి.అమీబా
9. వానపాములకు ఏమి వుండదు?
   ఎ. చర్మం
   బి. వెన్నెముక
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ. కస్తూరి రంగన్
   బి. రంగరాజన్

చిన్నారి చిత్రకారులు



కె.నవీన్ చంద్ర,
1వ తరగతి,
జవహర్ విద్యానిలయం ఇంగ్లీష్ హైస్కూల్, హైదరాబాదు.



జి.పూజిత,
8వ తరగతి,
వికారాబాద్.



ఆర్. జయమ్మ
9వ తరగతి,
జడ్‌పిహెచ్ఎస్,
షాబాద్, రంగారెడ్డి.

ఎస్.మణికంఠ, 5వ తరగతి,
ఆంధ్రా పబ్లిక్ స్కూల్,
హరిపాలెం, విశాఖ.

రంగులు వేస్తారా !

చిత్రకారుడు ఈ బొమ్మను భలేగా గీశాడు కదూ! మీ కోసమే. ఇంక ఆలస్యమెందుకు? రంగు పెన్సిళ్ళు, క్రేయాన్లు తీసుకొని చకచకా రంగులు నింపండి.

మాయమయ్యే తపాలాబిళ్ల



ఒక గాజుగ్లాసు ఉపయోగించి తపాలాబిళ్లను మాయం చేయగలరా! అదేంటి అలా చూస్తున్నారు? నేనేమన్నాను! గాజుగ్లాసుతో తపాలా బిళ్లను కనపడకుండా చేయగలరా? అని అడిగాను. అంతేకదా. 'అయ్యో! భలేవారే. తపాలాబిళ్లమీద గాజుగ్లాసు పెడితే చక్కగా అద్దంలోంచి చూసినట్టు కనపడుతుందండీ' అంటున్నారా? అయితే పందెం వేసుకుందామా? రెడీనా.

బల్లమీద ఒక తపాలా బిళ్ల వుంచండి. తర్వాత నీరు నింపిన ఓ గాజుగ్లాసును తపాలా బిళ్లపై వుంచండి. బొమ్మలో చూపించినట్టు గ్లాసును చిన్న పళ్లెంతో మూయండి. ఇప్పుడు గ్లాసు చుట్టూ నడిచి అన్ని వైపులనుంచి దానిలోకి చూడండి. మీకు తపాలా బిళ్ల కనిపించిందా! 'ఆగండి. పూర్తిగా చూడనివ్వరే' అంటున్నారా? మీరు ఒక రోజంతా చూసినా అంతే తపాలాబిళ్ల కనిపించదుకాక కనిపించదు.

ఏంటి అలా బుంగమూతి పెట్టారు? దానికి కారణం ఏంటో చెప్తాను ఎంచక్కా నవ్వుతూ చదవాలి. వక్రీభవనం వల్ల ఇలా జరుగుతుంది. కాంతి కిరణాలు నీటినుంచి గాలిలోకి ప్రసరిస్తున్నప్పుడు వంగుతాయి. పటంలోని గీతలు వక్రీభవనాన్ని చూపిస్తాయి. అందువల్లే మీరు తపాలాబిళ్లను చూడలేరు.

క్విజ్ 72 జవాబులు

1. ఎడిసన్ 2. సర్ రిచర్డ్ బర్టన్ 3. వస్త్రములు 4. హమ్మింగ్ 5. కృష్ణా 6. ఆక్సిజన్ 7. అమావాస్య 8. రేయాన్ 9. రాజ్యాంగపరిషత్ 10. ములాయం సింగ్ యాదవ్

క్విజ్ 71కి సరైన సమాధానాలు రాసిన వారు :

ఆర్.బాబూ నాయక్, 8వ తరగతి, మల్లాపాలెం, ప్రకాశం. **ఎమ్.శ్రీలక్ష్మి,** 5వ తరగతి, చిన్నమండలవీధి, శ్రీకాకుళం. **పెంటకోట అమర్ జయసింహ,** విల్లూరి అక్కయ్యగారివీధి, గవరపాలెం, విశాఖ. **ఎస్.లక్ష్మినారాయణరెడ్డి,** 9వ తరగతి, దువ్వలి, ప్రకాశం. **సిహెచ్. శ్రీనివాసరెడ్డి,** 10వ తరగతి, త్రిపురాంతకం, ప్రకాశం. **ఎన్.మాధవి,** 7వ తరగతి, **జి.విమల,** 9వ తరగతి, విద్యానగర్, పొన్నూరు. **పి.కోటేశ్వరరావు,** 5వ తరగతి, **పి.కోమలి** 7వ తరగతి, కోడూరు, గుంటూరు.

కలం స్నేహం

పేరు: సామల నవ్యశ్రీ,
వయసు : 10 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : కచ్చకాయలు, తొక్కుడుబిళ్ల ఆడడం, టీవీ చూడడం, లెక్కలు చేయడం, దీపిక, కథల పుస్తకాలు చదవడం.
పూర్తి చిరునామా : సామల నవ్యశ్రీ, 6వ తరగతి, డాటరాఫ్ వెంకటస్వామి, నవభారతి హైస్కూల్, చొప్పదండి, కరీంనగర్.

సవరణ

ఆగస్టు 24వ తేదీ సంచికలో వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి గ్రహీత హర్ గోబింద్ ఖొరానా 1992వ సంవత్సరం జనవరి 9వ తేదీ జన్మించారని వచ్చింది. అది 1922వ సంవత్సరంగా చదువుకోవాలి. ఆయన 1922వ సంవత్సరం జనవరి 9వ తేదీన జన్మించారని ది నోబెల్ ఫౌండేషన్‌వారి అధికారిక వెబ్‌సైట్‌లో వుంది. జనవరి 2న జన్మించారని చిల్డ్రన్స్ నాలెడ్జ్ బ్యాంక్‌లో వుంది. పొరపాటుకు చింతిస్తున్నాం.

– సంపాదకులు

చిన్నగీత - పెద్దగీత

అక్బర్-బీర్బల్ కథలు

బీర్బలు ఒకసారి పాదుషావారి దగ్గరకు వెళ్లాడు. అప్పుడు అక్బరు ఎంతో సంతోషంగా తూగుటుయ్యాల ఊగుతున్నారు. చిత్తూరు యుద్ధంలో సాధించిన విజయమే అందుకు కారణం. బీర్బల్ వెళ్లి పాదుషా ఎదురుగా ఒక ఆసనంలో కూర్చున్నాడు. అప్పుడు ఆయన బీర్బల్‌వైపు చూసి 'చిన్నవారు పెద్దవారు కావాలంటే చాలా కష్టం కదా?' అన్నాడు. చిత్తూరు యుద్ధంలో సాధించిన విజయాన్ని దృష్టిలో పెట్టుకునే అలా మాట్లాడుతున్నారని బీర్బల్‌కు అర్థమైంది. కానీ అమాయకంగా చేతులు జోడించి 'జహాపనా! అది సామాన్యులకు కష్టమే. కాని యుక్తిపరులకు మాత్రం కాదు' అన్నాడు.

'అదెలా?' అన్నాడు అక్బర్.

బీర్బల్ అక్కడున్న పలకమీద ఓ గీత గీశాడు. దానిని చక్రవర్తికి చూపిస్తూ 'ప్రభూ! ఈ గీత ప్రభువులవారు' అని గీతకు అటువైపు యిటువైపు చిన్న చిన్న గీతలు గీశాడు.

'ఆ గీతలు ఏమిటి?' అన్నాడు పాదుషా. 'ఈ చిన్న గీతలు సామంత రాజ్యాలు. చూడండి మొదటి గీత ఎంత పెద్దదిగా వుందో' అని చిరునవ్వు నవ్వాడు. అక్బరు పాదుషా సింహాసనం అధిష్టించేనాటికి కొద్ది రాజ్యమే వుంది. ఇప్పుడాయన ఆ రాజ్యాన్ని పెద్దదిగా చేశాడు. అందుకే బీర్బల్ అలా అన్నాడు.

పాదుషాకు బీర్బల్ చెప్పిన సమాధానం ఎంతగానో నచ్చి, ఆయనను సత్కరించాడు.

ఎగిరే చేప

ఎగిరే చేపలు వుంటాయని తెలుసా మీకు! తెలీదా? అయితే ఇవాళ చెప్పకుందాం. చేపలు నీటిలో వుంటాయి. ఎంచక్కా ఈదుతాయి. 'ఎక్సోసీటస్' అనే చేప ఈదటమేకాక, ఎగురుతుందికూడా. ఈ జాతి చేపలకు వాజాలు చాలా పొడవుగా, రెక్కల ఆకారంలో పెరిగి వుంటాయి. ఇవి కొద్ది దూరం నీటిపైన ఎగరగలవు.



పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

?	ని
	దవి
	ద్రుము
	ల్లవి
	గవాదు
	రువు

గతవారం జవాబులు

వా	ణి
	క్కు
	రధి
	డి
	మనుడు
	క్కాయ

కచేరి ✻ రుక్మిణి

గిల్టు బతుకులు - బెల్టు షాపులు

"యాద్గిరన్నా.. ఏందే ఇదీ.. మనూరి సీనే మారిపోయినట్లుంది. సాయంత్రం అయిందనగానే ఎక్కడెక్కడి నుండో కొత్త మనుషులు.. కొత్త మొకాలు.. అరె.. సైకిళ్ళ మీద.. రిక్షాలు.. ఆటోలు.. బజార్ల నిండా ఒకటే గుంపు..!" జక్కులోడు కండ్లు పెద్దవి చేసి మిటకరించి అడిగాడు.

"అది టూరిజం దెబ్బరా.. ప్రపంచంలో ఏ ఇజాలూ లేవనీ.. టూరిజమే నిజం అని మన సి.యం.గారు తోచినపుడల్లా వల్లె వేస్తున్నాడాయె! ఒరే.. అయినా టూరిజం అంటే.. చూడ్డానికీ.. తిరగడానికీ ఏదైనా 'అద్భుత' స్పాట్‌లుండాలి గద.. మన ఊర్లె రాములవారి గుడీ.. రావి చెట్టు అరుగూ... అవి తప్ప చూడ్డానికేమున్నాయి గనక! ఛ.. ఛ.. ఏదో మతలబుంది.." అని యాద్గిరి బీడీ ముట్టించి గప్పుగప్పున రెండు పీకులు పీకాడు.

అంతలో -

కాస్తంత అటు పక్క సందులో గోల మొదలయింది-ఎవరో ఇద్దరు ఆడవాళ్ళు నానా చండాలంగా బూతులకే తెగబడి సిగపట్లదాకా వచ్చినట్లుంది.

"అవునే.. నేను రెండ్రూపాలు తగ్గిచ్చి అమ్ముకుంట.. నా ఇష్టం! నువ్వూ ఓ అయిదు తగ్గిచ్చి అమ్ముకోరాదు.. భడవ..!" నర్సమ్మ కొంగు బిగించి గయ్యిమని ఎగబుతుంది.

"అదెట్ల.. అవతల అది సిండికేటు.. పెదరాజుగారు చెప్పిన రేటుకే మనందరం ఈ బెల్టు షాపులల్ల అమ్ముకోవాల్నని రూలు గద! నీ ఇష్టం! నాఇష్టం.. గివేం చెల్లవ్! మర్యాదగా చెప్తున్న మరోసారి గట్లమ్మినవంటే మర్యాద దక్కదు!" సరోజ ఘాటుగా గాండ్రించింది.

"అన్నా.. గిటుదా.. మంచి మద్రాసు సరుకు.. రాత్రే దిగింది.. బయటకన్న అయిదు రూపాయలు తక్కువ.. రావే!" నర్సమ్మ అపుడే సైకిలు మీద పోతున్న మనిషికి అడ్డంపడి ఆపింది. అతను ప్రశ్నార్థకంగా సరోజ వేపు చూశాడు. సరోజ ఇక నిగ్రహించుకోలేక తోక తొక్కిన తాచులా లేచి ఆడ పులిలా ఎగబడుతోంది.

నర్సమ్మా.. మూతిపళ్ళు రాలగొడతా.. ఆయనగారిది నాకాతా.. రోజు వచ్చేది.. తాగేది నా దగ్గరే.. నువుగాని అడ్డం పడినావంటే అంతే సంగతులు.. నా కోపం సంగతి నీకు తెలవదు - రావయ్యా రా..!" అని ఆ సైకిలు శాల్తీని బరబర లాక్కుని పోయింది. జక్కులోడికి అమాంతం మూర్ఛవచ్చినంత పనయింది. యాద్గిరి గట్టిగా పట్టుకుని రావి చెట్టుదాకా నడిపించి చప్టామీద కూలేశాడు. అప్పటికే ఊరంతా యమా తొక్కిడిగా ఉంది. కొంతమంది కారాబూందీ నవులుతూ.. జోకులు పేల్చుకుంటూ బజార్నపడి పోతున్నారు. ఒకళ్ళిద్దరు నడిచే ఓపిక లేక గుడి అరుగులకు జారగిలబడి పోతున్నారు.

"ఒరే.. మనూరంతా ఇట్లా తాగుబోతుల సంఘమైపోయిందేంది? అసలు వీళ్ళంతా ఎవరు? ఊర్నిండా ఈ కంగాళీ హంగామా ఏంది?" జక్కులోడు తల పట్టుకున్నాడు. అదుగో అప్పుడే లాఠీ ఆడించుకుంటూ ఎక్సయిజు కానిస్టేబులు ఎంకటయ్య ఊడిపడ్డాడు.

"అరె.. ఎంకటన్న నమస్తే... హమ్మయ్య.. ఒరె జక్కులోడా.. ఇంత కాలం నుండి ఎంకటన్న కనబడకపాయె! అన్నా నీతోని జరూరు పని పడింది.. నువ్వయితేనే శబ్బాసు.. సూడన్నా ఈ జనం ఏంది? అట్లా రోడ్ల మీద పడి తాగి బొర్లుడేంది? అసలు ఊర్లో ఈ బ్రాండి సీసాలేంది?" దిగాలుగా జక్కులోడు అడిగాడు.

ఎంకటయ్య ఎకిలిఎకిలిగా పడీపడీ నవ్వాడు. జక్కులోడు బిత్తర పోయాడు. "అవి బ్రాండీ సీసాలు.. అమ్ముతండ్రా.. వీళ్ళు కొనుక్కుని తాగుతుండ్రా.. దానికి మద్దెన మీరెందుకు పరేశాన్ కావాలె యాద్గిరన్నా..?" అని ముగించే లోగా సరోజ, నర్సమ్మలు మరో విడత జుట్లు పట్టుకుని జగడానికి దిగడంతో 'కయ్యి కయ్యి' మని అరుచుకుంటూ అటు పరుగు తీశాడు. కాసేపు సముదాయించి, తిట్టి మళ్ళీ తిరిగి వచ్చాడు.

"ఛ.. ఛా.. బుద్ధిగా అమ్ముకోడం చాతకాదు.. ఎపుడూ తన్నుకోడం.. తిట్టుకోడం.. అరె.. అవతల 'టార్గెట్లు' పూర్తిగాకపోతే జీతాలు ఆపి పారనూకుతానని సూపర్నెంటుగారి చిందులు.. ఇవతల వీళ్ళు సందుల్లో సిందులు.. ;ఛ.. ఛ.."

"అదేంటి సార్.. ఈ బెల్టు షాపులేంది? వీళ్ళందరూ అమ్మడమేంది?" ప్రశ్నకు ఎంకటయ్య వెకిలి నవ్వులు మరోసారి ప్రదర్శించాడు. "యాద్గిరన్నా! మన గవర్మెంటు బాగా అభివృద్ధి చెందాలంటే ఆదాయం కావాలెగద.. దానికి వీన్ని మించిన ఆదాయం లేదాయె! అందుకే ఒక్కో దుకాణం కంట్రాక్టరు కాకుండా అందరూ సిండికేటయి ఏకంగా అమ్ముకోడం.. ఒక పద్ధతి. రెండోది.. ఇట్లా సీరియల్ షాపులు అంటే మరేం లేదు. పక్క టౌన్లోని పెదరాజుగారే పెద్ద వైన్ షాపు కంట్రాక్టరు - ఆయనకు నెలసరి కోటా కింద మేం ఈ చీప్ లిక్కర్ సరుకును లెవీగా అందజేస్తాం - చచ్చినట్లు ఇట్లా ఊర్లెంటపడి అమ్మితేగాని కోటా పూర్తిగాదు - రేపట్నుంచి డోర్ డెలివరీ పద్ధతి కూడా పెడితే ఎట్లా ఉంటుందా అని ప్లాన్లు తయారు చేస్తున్నాం.. శ్రీకాకుళం జిల్లాలో బాగా జోరందుకుంది.. బాగా ఆదాయం.."

జక్కులోడికి బుర్రంతా తిరిగినట్లయింది. పిచ్చి చూపులు చూశాడు - "ఇక్కడ మనక్కావలసింది చవగ్గా చీప్ లిక్కరు జనాలకు అందుబాటులో ఉండడం.. వాళ్లు తాగిపారేయడం.. అమ్మే వాళ్ళందరికీ ఆదాయం.. స్వయం సహాయక బృందాలన్న మాట!" ఎంకటయ్య హుషారుగా చెప్పుకుపోతున్నాడు. యాద్గిరికి ఒళ్ళంతా కారం పూసినట్లయింది.

"అన్నా.. ఇంకో చిన్న సీక్రెటు.. నా ఏరియాలో నేను బాగా ఈ అమ్మకాలు పెంచితే నాకు వెంటనే ప్రమోసను.. హహ్హ" ఎంకటయ్య వికవికా వెకిలిగా నవ్వాడు.

"అంటే ఈ అమ్మకాలకు హద్దూ, అదుపూ ఉండదన్న మాట!"

"తాగే వాడికే లేనపుడు అమ్మే వాడికి హద్దేంది? తాగుబోతులు కొందర్ని పెర్మినెంటు కాతాదారులుగా ఏర్పాటు చేసుకుంటారు. అబ్బో.. ప్రతి సంవత్సరం ఇదవై శాతం అమ్మకాలు పెరగాలన్నది మన గవర్మెంటు టార్గెటు..."

* * *

ఎంకటయ్య ఇరవై శాతం టార్గెటు పెరుగుట సంగతి దేవుడెరుగు.. ఆ మర్నాడు ఉదయానికే గుడి అరుగుల దగ్గిర ఆరుగురు.. రావిచెట్టు చప్టా పక్కన ఏడుగురు.. అవతల బజారు సైడు కాల్వ పక్కన ముగ్గురు మొత్తం పదహారు మంది పీనుగులై నిక్కి నీలిగి పడున్నారు. పోలీసులు.. పంచనామాలు.. హడావుడి..

"నా బేరం చూసి ఓర్వలేకనే నా సీసాల్లో విషం కలిపిచ్చింది - అందుకే అట్లా..! నర్సమ్మ గుండెలు మండిపోతుండగా కాలుకాలిన పిల్లిలా గెంతులేస్తుంది. ఊరంతా మహా గందరగోళంగా.. చాలా ఛండాలంగా ఉంది. ఎక్సయిజు ఎంకటయ్య పత్తాలేడు.

"అన్నా ఇదేం మాయదారి రోగం.. అంతమంది ఒక్క దెబ్బకు పిట్టలు రాలిపోయినట్లు రాలిపోయినారు గదా.. పాపం!" జక్కులోడు గుండెలు బాదుకుంటూ చొంగలు కార్చాడు. యాద్గిరి పండ్లు ఘటఘట నూరుతున్నాడు. ●

కరెంటు ఛార్జీల గురించి నేను మాటాడదలుచుకోలేదు. వాటి కష్టసుఖాల గురించి నేను చర్చించను. దేశంలో ఉచిత విద్యుత్తు ఏర్పాటు ఏ రాష్ట్రంలో వుంది - ఎక్కడ లేదనే వివరాల జోలికి నేను వెళ్ళను. అక్కడెందుకుంది - ఇక్కడెందుకు లేదనే పాయింటు నేను పట్టించుకోను. ఏ పార్టీ అధికారంలోకి వస్తే దీపాలు వెలుగుతాయో - ఏ పార్టీకి జై కొడితే వెలుగుతున్న దీపాలు ఆరిపోతాయో కూడా నేను చెప్పదలుచుకోలేదు. కేవలం కరెంటు గురించి మాత్రమే నాలుగు ముక్కలు మనవి చేయాలనుకుంటున్నాను. ఆదికాలం మాటేమోగాని - ఇవాళ చాలా పనులు విద్యుత్ సరఫరా మీద ఆధారపడి జరుగుతున్నాయి. ఇంటో దీపం వెలగాలన్నా, రుబ్బుడు మిషను తిరగాలన్నా, ఫ్రిజులూ టీవీలు పని చేయాలన్నా, చివరికి షేవింగు చేసుకోవాలన్నా - కరెంటు కనికరించాలి!

మా ఇల్లెక్కడ?

కరెంటున్నంత మాత్రాన సరిపోదు. మెయిన్ స్విచ్ అంటూ ఒక పరికరం అఘోరించింది. దాన్ని కనిపెట్టుకునుండాలి. పచ్చజెండా చూపిస్తేనేగాని రైలు కదలనట్టు -మెయిన్ స్విచ్ ఆన్ చేస్తేనేగాని కరెంటుకి కాళ్ళు రావు. మెయిన్ ఆఫైపోతే దీపాలు వెలగవు సరిగదా - సమస్త ప్రపంచానికి దూరమైపోయినట్లు ఫీలింగు కలుగుతుంది. కిరసనాయిలు దీపాలు గుడ్డి వెల్తురునిస్తాయేగాని పంకాలను తిప్పలేవు. రుబ్బుడు మెషిన్ని ఆడించలేవు. ఫ్రిజు, టీవీల చేత పని చేయించలేవు. మెయినాఫైపోతే ఇంటిల్లిపాదీ ఆపసోపాలు పడక తప్పదు. ఇదేదో కరెంటు సమస్య గురించి రాస్తున్న భాగోతమనుకునేరు. మెయిన్ స్విచ్ గురించి మాత్రమే మనవి చేయాలని ప్రయత్నం చేస్తున్నాను!

ఇంటో ఇల్లాలిని మెయిన్ స్విచ్‌తో పోల్చి చెప్పేరు విజ్ఞులు. విద్యుత్ సరఫరాకి మెయిన్ స్విచ్ ఎంత ముఖ్యమో - సుఖ సంసార జీవితానికి ఇల్లాలి పాత్ర అంత విలువైనది! ఇల్లాలి ఆరోగ్యం సవ్యంగా వుంటేనే సంసార చక్రం సాఫీగా తిరుగుతుంది. వేళకి కాఫీలూ వేన్నీళ్ళూ దొరుకుతాయి. రుచికరమైన భోజనంతో పాటు అందమైన తాంబూలం, ఆ తర్వాత పడక సుఖం - అన్నీ వేళ ప్రకారం అందుబాటులో ఉంటాయి. దాంతో శ్రీవారి తేజస్సు ఇంటా బయటా కూడా దివ్యంగా వెలుగుతుంది. వారి మెదడు చాకులాగా పని చేస్తుంది. వారు తీసుకునే నిర్ణయాలు అద్భుతంగా వుంటాయి. అదంతా తన ప్రయోజకత్వమనుకుంటాడు. తన మేధాశక్తికి తానే మురిసిపోతుంటాడు. జగదేకవీరుడినని మెళ్లోబోర్డు కట్టుకుంటాడు. అవును సుమా అని ఇతరులు కూడా అతన్ని శ్లాఘిస్తారు. అంతేతప్ప అతని విజయ రహస్యానికి మూలమేదని ఎవ్వరూ అతన్ని అడుగరు. అడిగినా సరైన సమాధానం అతన్నుంచి రానేరాదు!

అదట్లా వుంచండి. ఒక మగమారాజు పెట్రొమాక్సు లైటల్లే వెలుగుతున్నాడంటే - వారి వెనక వారి ఇల్లాలు అండగా వుందని గ్రహించాలి. శ్రీవారికి ఏ వేళకు ఏది అవసరమో ఆమెకు తెలుసు. ఆమె చేసే సేవల్లో తేడాలొస్తే శ్రీవారి మెదడు ఏ లెవెల్లో పాడవుతుందో కూడా ఆమెకు తెలుసు. అల్లాంటి స్త్రీ మూర్తిని ఛీ... ఛా... అంటో కలవరపెడితే వేళకు కాఫీలుండవు. వేన్నీళ్ళు దొరకవు. పచ్చడి మెతుకులే కతకాలి. తాంబూలమ్మాట దేవుడెరుగు! ఆఫీసుకు టైమవడంతో పరుగులు తీయాలి. ఇంత అల్లరి జరిగేక ఆఫీసులో అతను స్థిమితంగా పని చేస్తాడనే గ్యారంటీ వుండదు. తప్పుడు డ్రాఫ్టులు తయారు చేస్తాడు. కర్తకర్మ క్రియల్లేకుండా పిచ్చి వాక్యాలేవో కాగితమ్మీద గుమ్మరిస్తాడు. పైవాడు వాటీజ్‌దిస్ సుబ్బారావ్ అని అడిగితే తెల్లమొహం వేస్తాడు. తప్పయిపోయిందని చెప్పకుండా అతి తెలివితేటలుపయోగించి తప్పించుకుందామనుకుంటాడు!

అతను అల్లాంటి దిక్కుమాలిన ప్రయత్నం చేస్తున్న కొద్దీ పైవాడితో చివాట్లు - చెప్పుదెబ్బలు టైపులో తింటాడు. దాంతో మెదడు పాడైపోతుంది. పాడైపోయిన మెదడ్తో రోడ్డున పడతారు. రోడ్డు మీద నడుస్తూ - శూన్యంలో నడుస్తున్నట్టు ఫీలవుతుంటారు. ఆటోలకు అడ్డం పడుతుంటాడు. ట్రాఫిక్ పోలీసులు తిడతారు. ఆ తిట్లతో అతను మరింత పిచ్చెక్కిపోతాడు. ఎటు నడుస్తున్నాడో తెలీక తప్పటడుగులు వేస్తుంటాడు. ఆ అడుగుల్తోనే తన వీధిలోకి వస్తాడు. ఇరుగూ పొరుగు పిల్లలు అతన్ని అంకుల్ అని పిలిస్తే - వాళ్లెవరో గుర్తుపట్టలేని దీనావస్థలో వెర్రినవ్వు నవ్వేస్తాడు. ఎందుకైనా మంచిదని మా ఇల్లెక్కడ అని అడుగుతాడు. ఈ విచిత్ర విన్యాసాలు గమనించి - సుబ్బారావు పనైపోయిందని వీధి జనాభా చెప్పుకుంటారు. ఈ గొడవలన్నీ మెయిన్ ఆఫ్ కావడం వల్ల జరుగుతున్నాయని అతను తెలుసుకోవాలి! తన పాలిట ఇల్లాలే మెయిన్ స్విచ్ అని అతను అర్థం చేసుకోవాలి! ●

❋ జి. మదన్

శిల్ప కళా నిలయం శ్రీరంగం



శ్రీరంగం పట్టణం నిద్రపోయే ముందు అమ్మమ్మలు చెప్పే కథల్ని మన ముందుంచుతుంది. మాలిక్ కాఫర్ క్రీ.శ. 1310 - 1311లో దక్షిణ భారతదేశంపై దండయాత్ర చేసినప్పుడు ఈ ఆలయంలోని రంగనాథస్వామి విగ్రహంతో సహా మొత్తం సంపదను ఢిల్లీకి తరలించాడు. ఢిల్లీ సుల్తాను కుమార్తె ఆ విగ్రహాన్ని చూసిన వెంటనే దాని అందానికి ఆకర్షితురాలై పూజించడం ప్రారంభించింది.

అనంతరం కొందరు భక్తులు గాయకులు, నర్తకుల రూపంలో సుల్తాను మహల్‌లోకి ప్రవేశించి ఆయన్ని ఏమార్చి ఆ విగ్రహాన్ని శ్రీరంగానికి తరలించారు. ఆమె ఆ విగ్రహాన్ని తిరిగి తెప్పించడానికి ఎంతగానో ప్రయత్నించింది. కాని అది సాధ్యం కాకపోవడంతో ఆమె మనోవ్యథతో మృతి చెందింది. ఆమె భక్తి ప్రపత్తులను గౌరవిస్తూ ఆమెకు తులుక్క నాచియార్ అని పేరు పెట్టారు. ఆలయ ప్రాంగణంలోనే ఆమెకు కూడా ఒక గుడి కట్టారన్న కథ అక్కడ ప్రచారంలో ఉంది.

ఆ కథను అలా ఉంచితే ఆలయ నిర్మాణంలో ఉపయోగించిన వాస్తుకళ, శిల్పకళా నైపుణ్యం అద్భుతంగా ఉంటుంది. తిరుచ్చినాపల్లికి 13 కి.మీ. దూరంలో శ్రీరంగం పట్టణం ఉంది. ఇది టిప్పు సుల్తాన్ పాలించిన మైసూర్ రాజ్యంలో వుండేది. ఇది కావేరి, దాని ఉపనది కొల్లిడం నదుల బాహువుల్లో ఇమిడి ఉండి ఒక ద్వీపం వలె గోచరిస్తుంది. ఈ పట్టణాన్ని, ఆలయాన్ని వేరుచేసి చూడలేము. 156 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పట్టణం చుట్టూ ఎత్తయిన ప్రాకారాలున్నాయి. ఎత్తయిన గోపురాలు, ప్రాకారాలు దీనిని ఒక కోట వలె తయారు చేశాయి.

శ్రీరంగాన్ని వైష్ణవుల పవిత్ర స్థలంగా భావిస్తారు. శ్రీరామానుజాచార్యుని శిష్యులకు ఇది ఒక పవిత్ర పుణ్య క్షేత్రంగా ఉంది. ఇక్కడ వైకుంఠ ఏకాదశి రోజున గొప్ప ఉత్సవం జరుగుతుంది. దీనికి వేలాది మంది భక్తులు వస్తారు. శ్రీరంగం పట్టణం ఏడు ఎత్తయిన ప్రాకారాల నడుమ ఉంటుంది. ఇక్కడ 21 ఎత్తయిన కట్టడాలున్నాయి. రాతి స్తంభాలకు అందమైన నగిషీలు చెక్కారు.

మీరు ఈ పట్టణంలోకి ప్రవేశించగానే అద్భుతమైన కట్టడాలు కనువిందు చేస్తాయి. శేషశయన మండపం ప్రవేశంలో ఉన్న ఎనిమిది స్తంభాలపై చక్కటి శిక్షణనిచ్చిన గుర్రాల శిల్పాలు ఉంటాయి. వాటిపై కూర్చున్న వారు నిర్భయంగా వన్య జంతువులను వేటాడుతున్న దృశ్యాలు అద్భుతంగా ఉంటాయి. అరియర్కాల్ మండపం లేదా వేయి స్తంభాల మహల్ (వాస్తవానికి 953 ఉంటాయి) నాటి శిల్పుల నైపుణ్యానికి మచ్చుతునక.

శ్రీరంగం ఆలయాన్ని తొలుత విభీషణుడు నెలకొల్పినట్లు ఓ కథ ప్రచారంలో ఉంది. భారతదేశంలో విభీషణునికి ఆలయం ఉన్న ఒకే ఒక్క స్థలం ఇదే. పదవ శతాబ్దం వరకూ ఇక్కడ ఆలయం ఉన్న విషయం సిలప్పాదికారం, నలయిరాదివ్యపిరబందం వంటి గ్రంథాలలో మాత్రమే ఉంది. పదవ శతాబ్దంలో చోళుల ఆగమనం (పరాంతకుడు క్రీ.శ. 907 -953) అనంతరం శిలాశాసనాలు ఆవిర్భవించాయి.

చోళులు, పాండ్యుల పాలనా కాలంలో ఈ ఆలయం ఎంతగానో అభివృద్ధి చెందింది. రాజులు, రాచకుటుంబీకులు ఈ ఆలయానికి ఎన్నో బహుమతులు ఇచ్చేవారు. ఈ రకంగా దీనికి పెద్ద ఎత్తున బహుమతులు సమర్పించిన వారిలో మొదటి జాతవర్మ సుందర పాండ్య (క్రీ.శ. 1251 - 1268) ప్రముఖుడు. ఈ ఆలయ అభివృద్ధికి హోయసాలులు, విజయనగర రాజులు, నాయక రాజులు ఎంతగానో తోడ్పడ్డారు. ఆ రాజులు ఈ ఆలయానికి భూములు, గ్రామాలు, బంగారం, వజ్రాల ఆభరణాలను బహుమతులుగా ఇచ్చేవారు. ఈ విషయంలో ఆంగ్లేయులు కూడా ఏమీ వెనుకబడలేదు. 1875లో వేల్స్ రాకుమారుడు (అనంతరం ఆరవ ఎడ్వర్డు రాజు) ఒక స్వర్ణ కిరీటాన్ని బహూకరించాడు. అది నేటికీ స్వామి ఆభరణాల్లో భాగంగా ఉంది.

శ్రీరంగం ప్రజలకు రంగనాథ స్వామి కేవలం దేవుడు మాత్రమే కాదు. ఆయన వారికి రాజు. వారి జీవనాధారం. ఈ పట్టణ ప్రజలు రంగనాథుడే తమ రాజు అనే గుడ్డి నమ్మకంతో ఉన్నప్పటికీ పర్యాటకులకు మాత్రం ఇది తన అద్భుత కళా సంపదతో కనువిందు చేస్తోందనడంలో అతిశయోక్తి లేదు. ●

* వనగంటి నవీన్ కుమార్

- ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అంజూ బాబి జార్జ్ హైజంప్‌లో కాంస్య పతకం సాధించి చరిత్ర సృష్టించింది.
- వింబుల్డన్‌లో సానియా మీర్జా తిరుగులేని సర్వీసు చేసి భారత మహిళా టెన్నిస్‌లో మేటి క్రీడాకారిణి అని నిరూపించుకున్నది.
- భారత్‌కు చెందిన అండర్ -18 ఫుట్‌బాల్ జట్టు వేల్స్‌లో అద్భుతమైన గోల్ చేసింది.
- భారత హాకీ జట్టు తన పూర్వ వైభవాన్ని తిరిగి తెచ్చుకున్నది.
- భారత యువ వాలీబాల్ జట్టు చేసిన సర్వీసులతో ప్రపంచంలో గొప్ప జట్లలో ఒకటిగా నిలిచింది.
- ఫుట్‌బాల్‌లో బైచుంగ్ భుటియా గోల్డెన్ గోల్‌తో ఈస్ట్ బెంగాల్ జట్టు ఆసియా క్లబ్ టైటిల్ హస్తగతం చేసుకుంది.
- కామన్వెల్త్ క్రీడల్లో భారత మల్ల యోధులు బంగారు పతకాన్ని కొట్టుకొచ్చారు. వీరంతా మీకు గుర్తుండి ఉంటారు.

ఇతర క్రీడల్లోనూ ఎదుగుతున్న భారత్

గతంలో రాణించి తర్వాత మరుగున పడిన క్రీడా రంగాల్లో భారత ఆటగాళ్లు ఇటీవల కాలంలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. క్రికెట్‌పైనే ఆసక్తి కనబర్చే భారత క్రీడాభిమానులు కూడా ఇటీవల కాలంలో ఇతర క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. భారత క్రీడారంగానికి బంగారు భవిష్యత్తు ఉందని ఈ మార్పు సూచిస్తోంది. ఇప్పటివరకు క్రికెటర్ల విజయాలను గూర్చి మాత్రమే చర్చించే మీడియా గడచిన కొద్ది నెలల నుండి ఇతర క్రీడలపట్ల ఆసక్తి కనబరుస్తోంది. విదేశాల్లో భారత హాకీ జట్టు సాధించిన విజయాలను మన దిన పత్రికలు పతాక శీర్షికల్లో పెట్టి ఉత్సవంలా జరుపుకున్నాయి.

ధన్‌రాజ్ పిళ్లే, బయిచంగ్ భుటియాలు టెలివిజన్ ఛానళ్లలో దర్శనమిస్తున్నారు. అంజూ జార్జ్ శిక్షణా తరగతుల వివరాలు, అందులో ఆమె ప్రదర్శించిన ప్రతిభను మీడియా ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోగలుగుతున్నాం. క్రీడలకు బహుముఖ ప్రాచుర్యం కల్పించే ఆస్ట్రేలియాలో మనం ఉన్నామనే భావన కలుగుతోంది. ప్రపంచ టోర్నమెంట్లలో పతకాలు సాధించిన వారికి లక్షల రూపాయలు బహుమతిగా ఇవ్వడంతోనే భారత క్రీడారంగాన్ని అభివృద్ధి పరుస్తున్నట్లు ప్రభుత్వం, అపఖ్యాతి గాంచిన క్రీడా సమాఖ్యలు భావిస్తున్నాయి. అంతేకాక ప్రయోజన శూన్యమైన ఆఫ్రో-ఆసియన్ గేమ్స్‌ను నిర్వహించేందుకు ప్రభుత్వాలు ఉత్సాహం చూపుతున్నాయి. క్రికెట్‌కే పరిమితమైన మీడియా ప్రత్యేకించి ఎలక్ట్రానిక్ మీడియా ఇప్పటికైనా తన ధోరణిని మార్చుకోవడం ఆనందకర విషయం. వీలుంటే ప్రభుత్వం, క్రీడా సమాఖ్యలు, మీడియా, కార్పొరేట్ సంస్థలు భారత క్రీడారంగంలో జరుగుతున్న మార్పులను దగ్గరి నుంచి చూడాల్సిన అవసరమున్నది. వివిధ క్రీడారంగాలకు చెందిన ఆటగాళ్లు తాము సాధించిన ప్రతి విజయాన్ని పెట్టుబడిగా మార్చుకోవాలనే దానిపై ఆసక్తి కనబరుస్తున్నారు. తాము కూడా హీరోలమేనని సానియా మీర్జా, ధన్‌రాజ్‌పిళ్లే, అతని జట్టు సభ్యులు భావిస్తున్నారు. జకార్తాలో జరిగిన ఆసియా క్లబ్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన బిఇసి తెరో ససనా జట్టుపై భుటియా చేసిన అద్భుత గోల్‌ను విదేశీ ఛానళ్ల ద్వారా ప్రత్యక్షంగా చూడగలిగాము. తమ దేశ ఆటగాడు చేసిన గోల్‌ను ప్రత్యక్షంగా చూడడం క్రీడాభిమానులకు కొత్త అనుభవం. ఈ అద్భుతాన్ని అభిమానులు ఊహించి ఉండరు. ఎందుకంటే క్రికెట్‌లో బంగ్లాదేశ్ స్థానం ఎంతో ఫుట్‌బాల్‌లో మన స్థానం కూడా అంతే. తమ జట్టు సహచరులు ప్రత్యర్థుల సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో విశేష నైపుణ్యం, ఉత్సాహం చూపి తమకు కూడా ఇంగ్లీష్ లీగ్ ఆడడానికి అన్ని అర్హతలు ఉన్నాయని భుటియా నిరూపించాడు. ఏథెన్స్ ఒలింపిక్స్ సమీపిస్తున్న సమయంలో అంజూ బాబి జార్జ్ సాధించిన విజయం ప్రత్యేకతను సంతరించుకున్నది. రాజీవ్ ఖేల్ రత్న, షూటర్ అంజలీ భగవత్ కూడా ఏథెన్స్‌లో పతాకాలను ఆశిస్తోంది. యావత్ ప్రపంచం నిర్ఘాంతపోయే విధంగా చదరంగంలో విజయాలు సాధించిన మాజీ ప్రపంచ చెస్ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ స్ఫూర్తితో వేలాది మంది యువకులు దేశవ్యాప్తంగా చదరంగం పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రపంచంలో 40వ స్థానం సాధించిన శశికిరణ్, 2000లో ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌గా నిలిచిన



కోనేరు హంపి, పెంట్యాల హరికృష్ణ, భారత యువ కిరణాలు రైఫిల్ షూటింగ్‌లో అభినవ్ బింద్రా, ఫాస్ట్ ట్రాక్ రేస్‌లో కార్తికేయన్ తమ కళ్ళల్లో కలలను, హృదయంలో ఆశయాలను నింపుకున్నారు. భారత క్రీడా రంగ సమస్యకు ముఖ్య కారణం క్రికెట్ అని విమర్శించే బదులు దీనికి గల కారణాలను విశ్లేషించాలి. అంతా మంచే జరుగుతున్న ఈ సమయంలో ఈ విశ్లేషణ ఎంతైనా అవసరం. సమాఖ్యల అధ్యక్షులుగా రాజకీయనాయకులకు, బడా కంపెనీ అధిపతుల స్థానంలో క్రీడల్లో అనుభవం ఉన్నవారిని నియమించాలి. భారత చెస్ సమాఖ్యలో ఈ విధానాన్ని అమలు పరిచి విజయాలు సాధించారు. దీని కార్యదర్శి పి.టి. ఉమర్ కోయా. ఈయన్ని నిరంకుశుడని నిందించారు. కాని ఒక లక్ష్యంతో ముందుకు సాగిపోతున్నారు. ఈ సమాఖ్య సంవత్సరమంతా టోర్నమెంట్‌లను నిర్వహిస్తున్నది. క్రమం తప్పకుండా ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లను భారత్‌లో నిర్వహిస్తోంది. అంతే కాక కోచ్‌లుగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వారిని నియమిస్తున్నారు. దీనివల్ల ఆటగాళ్లు అంతర్జాతీయ పోటీల్లో తరచూ రాణించగలుగుతున్నారు. ఫలితంగా భారత్ అతి తక్కువ కాలంలోనే ప్రపంచ చెస్ రంగంలో సూపర్ పవర్‌గా నిలిచింది. ఇప్పటికైనా ప్రభుత్వం రివార్డులను ప్రకటించడానికే పరిమితమవకుండా అథ్లెట్లు సమర్థవంతగా ఆడేందుకు అవసరమయ్యే సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేయాలి. ●

✻ పులి కళ్యాణి

ప్రముఖ మానసిక వైద్యుడు డా॥ బ్రహ్మానందం గారికి మొన్నటి వరకూ ఈగలు దోలడమే పని! పొద్దున్నే హాస్పిటల్ తెరిచి కుర్చీలో కూలబడి వీధిలోకి మిటుకూ మిటుకూ చూసేవాడు. ఆయనగారి బోర్డులో బోలెడన్ని ఫారిన్ డిగ్రీలు... డిప్లొమాలు... పైగా ఈయనగారికి తోడుగా బహు ఓపికవంతురాలైన, చలాకీ అయిన సిస్టర్ చొరవ కూడా తన దైనందిన కార్యక్రమంలో బ్రహ్మానందానికి చాతనైన సాయం చేసేవి.

(అ)న్యాయ నిర్ణయం



"ఇట్లా మీరు ఈగలూ... నేను దోమలూ తోలుకుంటూ కూలబడే పరిస్థితి మారిపోతుంది మీరు నమ్మండి" అని శాంతంగా ధైర్యవచనాలు వల్లిస్తుంది. బ్రహ్మానందం బలవంతపు నవ్వోటి నవ్వి బట్టతలను సున్నితంగా బాదుకునేవాడు!

ఆ ఉదయం ఆసుపత్రిలో హడావుడి ఏర్పడింది. ఒకావిడ భర్తనూ... ఇద్దరు పిల్లల్నీ వెంటేసుకుని ఆసుపత్రిలో అడుగు పెట్టింది. బ్రహ్మానందం తాత్కాలికంగా ఈగల పనాపుచేసి ప్రకాశవంతమై పోయాడు.

"ఏంటమ్మా... ప్రాబ్లం ఎవరికి? నీకేనా... మీ వారికా? మీ పిల్లలకా?"
దానికి ఆవిడ చురచురా చూసి చూపుడు వేలితో భర్తను చూపించింది. ఆయనగారికి నలభై ఏండ్లుండవచ్చు! మనిషి మంచి ఆరోగ్యంగా నవనవ లాడుతున్నాడు. సాదాసీదాగా శుభ్రంగా వున్నాడు. నున్నగా దువ్విన క్రాపు... కంటికిసులోచనాలు!

"మీ వారికేనా? పేరేమిటి? వ్యాపకం ఏంటి? అసలు సమస్య ఏంటటా?" ఆవిడ వెంటనే కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. పిల్లలు బేలగా చూశారు.

"మావారు హైస్కూల్లో సోషల్ పాఠాలు చెప్తారు. పాతికేండ్ల సర్వీసు... పిల్లల్లో అటు అధికార్లలో ఆయనకు ప్రేమా... గౌరవం...

"మరి?"

"చూడండి... పెళ్ళయి ఇన్నేండ్లు గడిచినా... ఇదుగో ఈ ఇద్దరు పిల్లలు. మా సంసారంలో ఎలాంటి గొడవలు... చీకాకులు లేవు" ఆవిడ తమ ఆదర్శ అన్యోన్య సంసారం గురించి కాసేపు వల్లిస్తుంటే బ్రహ్మానందానికి చికాకేసింది. అయినా నిగ్రహించుకున్నాడు.

"ఏముందండీ... ఈ మధ్యనే అపరాత్రి... తెల్లవారుజాము అని లేకుండా ఒకటే వలవరింతలు.. జుట్టు పీక్కోటం... (బ్రహ్మానందం సానుభూతిగా టీచర్‌గారి బుర్రవంక చూశాడు) కలవరింతలు... మంచం మీదెగిరెగిరి పడడం... అపుడపుడు జారి నేల మీద కూడా పడడం.... జ్వరం లేదు... ఇంతకు ముందు ఇలాంటి అవలక్షణాలేం లేవు...

టీచరుగారు మందహాసం చేశారు. బ్రహ్మానందం ఆయనగార్ని కొన్ని ప్రశ్నలడిగారు. చాలా మర్యాదగా... నిజాయితీగా సమాధానాలు చెప్పాడు.

కౌన్సిలింగు పూర్తయింది. బ్రహ్మానందం పదిహేను రోజులకు సరిపడా మందులు పరపరా గిలికాడు. "చూడమ్మా... ఇవి రెగ్యులర్‌గా.. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వాడండి. ఏం ఫర్వాలేదు. సంతోషంగా వుండండి...! సగం బలం... హీఈజ్ క్వయిట్ నార్మల్... ఏమండీ హిస్టరీ మాస్టారూ... ఏం ఫర్వాలేదు. అన్నీ సర్దుకుంటాయి. ముందు మీరు జుత్తు పీక్కునే ప్రమాదం తప్పిపోయింది. హహ్హా... ఎందుకంటే ఇప్పటికే మీకు దాదాపు పూర్తి బట్టతల వచ్చేసింది." బ్రహ్మానందం వాళ్ళను కాసేపు ఆహ్లాదపరిచాడు. శారద కూడా నవ్వింది. వాళ్లు బిల్లు చెల్లించి బయటపడ్డారు!

* * *

మర్నాడు బ్రహ్మానందం ఆసుపత్రి ముందు చిన్నపాటి 'క్యూ' మొదలయింది. రకరకాల వ్యక్తులు... వయసులో... ఠీవిలో... దర్పంలో... సందడిగా వుంది.

"మా పూరి బాంకిలో

కానియరుగోరండి.. ఇంకా బ్రెమ్మచారే... పెండ్లికాలా! రెండేండ్ల నుండీ అదే బేంకిలో పన్జేస్తున్నాడు. మనిషి చాలా మంచోడు! ఒక యాభై ఏండ్ల పంచ ఆసామీ బ్రహ్మానందానికి చెప్పుకుపోతున్నాడు. ఎదురుగా కూర్చున్న యువకుడు చాలా నీట్‌గా... టక్ చేసి స్మార్ట్‌గా వున్నాడు. మనిషి చూపులు మాత్రం అదోలా వున్నాయి. శూన్యంలోకి చూస్తున్నాడు. అసలు ఈ బ్రహ్మానందాన్నీ... సిస్టర్ శారదను పట్టించుకున్న దాఖలాలు లేనేలేవు.

"ఏమిటి ప్రాబ్లం!"? బ్రహ్మానందం కులాసాగా కాళ్ళూపుతూ అన్నాడు.

"నేను పొలం.. తోటా బాగానే వున్నవాడ్ని... డోర్నకల్ దగ్గర గొల్లగూడెం.. అబ్బాయి చాలా బుద్ధిమంతుడనీ... మంచి బేంకుద్యోగమనీ అన్నీ కనుక్కుని ఈ ఎండాకాలవే మా అమ్మాయినిచ్చి పెండ్లి చేసేద్దామనుకుంటున్నాను గదా... ఇంతలోనే ఈ 'మాయదారి రోగం' వచ్చి పడె..

"రోగమా? మాయలా?" బ్రహ్మానందం కళ్ళు చికిలించాడు.

"అయ్యో... నేను రోజు విడిచి రోజు బేంకికి పోతాను గదండీ... అంతా బాగానే వుండేవాడు... కాఫీ అదీ తెప్పించి మాట్లాడేటోడు.. ఒక వారం దినాల్నుండి నేను చూసిన గద! పక్కనున్న చెక్కబల్ల మీద వుండుండి తల ఒకటే బాదుడు! పండ్లు పటపటమని ఒకటే కొరుకుడు! ఒకోసారి చిట్లి రక్తం కూడా కారె! నేనేం చేతును! అటు తర్వాత అంతా మామూలేనండి! నవ్వుతాడు! పాపం కుర్రాడి తలకాయగదా! అదిగానీ పోతే మరెట్లా అని ఆ తలబాదుకునే చోట మందపాటి స్పాంజి ముద్దలు బిగదీసిపించిన ! ప్చ్...! ఎట్లా బాగుపడతాడో ఏంటో?" ఆ ఆసామీ చాలా దిగాలుగా అన్నాడు. వెంటనే ఆ సదరు స్మార్టు ఉద్యోగి హఠాత్తుగా డా॥ బ్రహ్మానందం ముందున్న టేబిలుకేసి సదరు తలకాయను ఓ నాలుగు బాదులు బాది... పళ్ళికిలించి వెంటనే మామూలు మనిషైపోయాడు. బ్రహ్మానందం హడలిపోయాడు. ఆ యువకుడి వంక సూటిగా చూడలేక బరబరమని మాత్రలు అవీ రాసి బయట ఒక్కసారిగా గందరగోళం... అరుపులు వినిపించాయి!

"యహె... వదిలి పెట్టండ్రె... లేదే... వదులసె...!" అక్కడ రాతివెండి మిల్లులో పని చేసే రాజయ్య మొదటి దశగా అప్పటికే ఒంటిమీది చొక్కా బదా బదలుగా చించి పారేసుకున్నాడు. ప్రస్తుతం ఒంటిమీది బనీను పీలికలు చేసి పారేయడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు! అతడి భార్యా... ఎదిగిన కొడుకూ ఒడిసి పట్టుకున్నా రాజయ్య వీరంగం ఆపడం లేదు!

"ఏంటమ్మా.. నీ మొగుడు చీప్ లిక్కర్‌గానీ పీకుతాడా?" బ్రహ్మానందం చిలిపిగా వుల్లాసంగా అడిగాడు. ఆవిడ అవాక్కయి నోరు తెరిచింది! ఎదిగిన కొడుకు మటమటలాడిపోయాడు.

"అదేం లేదు సార్... సారా కల్లు అంటే చాలు ఆయన మంటలు మండి ముక్కు బిగదీసుకుంటడు.." ఆవిడ కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోతూ ముక్కు ఎగబీకింది.

"మరి ఆ చీకాకేంటి..." ఎప్పట్నుంచీ...

"అయ్యో... ఏం చెప్పేది? వారం పద్దినాలాయె! మంచిగనే ఉంటడు... ఉండుండి తినే బువ్వ మీద్నుండి లేచి... పండ్లు

"ఏంటి సిస్టర్... గత రెండు మూడు రోజుల్నుండీ ఏంటీ వరస? నాకేం అర్థం కావడం లేదు. ఈ జనం ఏంటి? వింత వింత చేష్టలేంటి? అందునా అందరూ వుద్యోగస్తులే కావడంలో వింతేంటి? ఏదైనా గాలిమార్పా? చేతబడులా? పూనకాలా? సామూహిక హిస్టీరియానా? వాట్...?"

పటపటనూరుడు.. ఒంటిమీద లుంగీ... హవ్వ... బనీన్లు... అన్నీ పీకి పీలికలు చేసి పారేసుడు.. ఎట్ల సచ్చేది? సందెడు గుడ్డల దాకా చింపితె మూట గట్టిన..!

"అద్సరే... తన ఒంటిమీదివేనా... మరెవరి మీదనైనా పడి చింపి పారేస్తడా?" బ్రహ్మానందం భయంభయంగా అడిగాడు. ఆవిడ వంకా... రాజయ్య వంకా మిర్రిమిర్రి చూశాడు. రాజయ్య కసిగా పండ్లు పరపర నూరి పారేస్తుంటే బ్రహ్మానందానికి ఒంట్లో కాస్తంత వణుకు మొదలయింది!

"సర్సరె... ఏం లేదుగానీ... ఇదుగో ఈ గోళీలు.. జాగ్రత్త మూడు పూటలా వాడాలి - తగ్గిపోద్ది...!" బ్రహ్మానందం డాక్టరు పరపరా రాసిచ్చాడు. ఆవిడ అందుకుని రాజయ్యను తీసుకుని బయట పడింది. మరో నిమిషంలో రాజయ్య ఎదిగిన కొడుకు అనుమానంగా బయటపడి వెనక్కి తిరిగి వచ్చి లోగొంతుకతో చాలా నెమ్మదిగా అడిగాడు. "అంటే డాక్టరుగారూ... ఈ మందులు వాడితే మా ఫాదరు ఒంటిమీద బట్టలు చింపేసుకోవడం ఆపేస్తాడా - ఆపి, ఇతర్ల చొక్కాల మీదికి ఎగబడతాడా ఏంటి? ఆ ప్రశ్నకు బ్రహ్మానందం కుర్చీలో ఎగిరిపడి ఒక పెనుకేకలాంటిది పెట్టాడు -ఆ అబ్బాయి రఖడునుకుని బయటకు వెళ్లిపోయాడు. బయట అంతా పేషెంట్లే! అందులో పరికించి చూస్తే విచిత్రంగా అందరూ ఏదో ఒక రకమైన ప్రభుత్వ ఉద్యోగులే కావడంతో బ్రహ్మానందం మెదడ్లోకి భూతం లాంటి ప్రశ్న ఓటి అమాంతంగా వచ్చి జొరబడింది.

"ఏంటి సిస్టర్... గత రెండు మూడు రోజుల్నుండీ ఏంటీ వరస? నాకేం అర్థం కావడం లేదు. ఈ జనం ఏంటి? వింత వింత చేష్టలేంటి? అందునా అందరూ వుద్యోగస్తులే కావడంలో వింతేంటి? ఏదైనా గాలిమార్పా? చేతబడులా? పూనకాలా? సామూహిక హిస్టీరియానా? వాట్...?"

సిస్టర్ శారద మందహాసం చేసింది - 'అదికాదుసర్... వాళ్ళంతా ప్రభుత్వ ఉద్యోగులు.. ప్రతి ఒక్కరికీ వాళ్ళ ఉద్యోగపరమైన సమస్యలు మొదట్నుండీ వుంటూనే వున్నాయి. ఏ గవర్నమెంటూ వాటిని పరిష్కరించడానికి ముందుకు రావడం లేదాయె! పైగా ఈ మధ్య ప్రపంచ బ్యాంకు... ప్రైవేటీకరణ దెబ్బకు వాళ్ళకు మరిన్ని కొత్త సమస్యలు... వాటిని ప్రభుత్వ దృష్టికి తేవడానికి వాళ్ళకు వున్న కాస్తంత 'నిరసన' తెలిపే రూపం ఈ 'సమ్మె' గదా! ఒకవైపు వున్న హక్కులూ... సౌకర్యాలు వూడిపోతుంటే వాళ్ళు సమ్మెలకు దిగక తప్పదాయె! దానికి కారణం ప్రధానంగా ప్రభుత్వం... ఇటు యజమానులు... అయితే సమ్మెలు చేసే హక్కు అసలు ఉద్యోగులకు లేనేలేదనీ... అది చట్ట విరుద్ధమనీ మన సుప్రీంకోర్టు తాజాగా తీర్పు చెప్పిందాయె! ఇట్లా ఉద్యోగులకు ఇది మరోకొత్త ఆందోళనకర అంశం... అయినా ఇట్లా మానసికాందోళన పడకుండా 'సమ్మె హక్కు'ను రాజ్యాంగ పరిధిలో చేర్పించడానికి తగిన పోరాటాలు చేస్తే సరిపాయె...

బ్రహ్మానందం దబ్బున నేలమీద పడ్డాడు!

కాలక్షేప కథలు



గోవిందరాజు రామకృష్ణారావు కథలు
ముద్రణ, ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

గోవిందరాజు రామకృష్ణారావు కథలన్నీ కుటుంబ సంబంధాల చుట్టే తిరుగుతాయి. కుటుంబ సభ్యుల మధ్య ఉండే ప్రేమలు – ఎడబాట్లు, రెక్కలొచ్చిన పిల్లలు వెళ్ళి పోవడం, ముసలితనంలో నిరాదరణ, భార్యా వియోగం వల్ల సంభవించే ఒంటరితనం – వీటన్నింటి గురించి ఈ కథలు తెలియజేస్తాయి.

తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి తమ పిల్లలను ప్రయోజకులను చేయగా వారిలో కొందరు విదేశాల్లో, మరి కొందరు ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో చేరి తల్లిదండ్రులను పట్టించుకోకపోతే ఆ నిరాదరణకు, ఒంటరితనానికి క్రుంగిపోయే తల్లిదండ్రుల కథలే ఇందులో ఎక్కువగా కనిపిస్తాయి. ఈ కథల్లో కొడుకులంతా ప్రయోజకులై జీవితంలో స్థిరపడ్డాక భార్యా విధేయులై స్వార్థంగా ప్రవర్తిస్తారు. పెళ్ళయిన తర్వాత కుటుంబ సంబంధాలన్నీ పెళ్ళాం ఇష్టాయిష్టాలకు వదిలేసే కొడుకుల 'మల్లెల మనసు' ను కూడా మనం చూడవచ్చు. చివరలో హఠాత్తుగా వారికి సినిమాటిక్‌గా జ్ఞానోదయం కావడంతో శుభం పలుకుతూ ముగుస్తాయి. ఈ కథల్లో ఎన్ని బాధలు పడినా ఆ తల్లిదండ్రులకు కొడుకుల మీద కోపంగానీ, బాధగానీ లేకుండా అది కర్మబంధం అనుకొని నిర్లిప్తంగా సాగిపోయే త్యాగమూర్తులుగా కనిపిస్తారు. ఈ గ్లోబలైజేషన్ పీరియడ్‌లో తండ్రులు ఇంకెంత త్యాగమూర్తులుగా ఉండాలో వివరించే కథ 'విశ్వ కుటుంబంలో ఓ తండ్రి'.

మరికొన్ని కథలు మారుటి తల్లి పెట్టే బాధలను వివరిస్తాయి. చివర్లో ఆ తల్లులు కూడా మారిపోయి ప్రేమను కురిపిస్తారు. "ఇంటి వెలుగు" కథలో తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకుంటే భయపడిన జయ, తండ్రి మనసు తెలుసుకొని తండ్రిని, సవతి తల్లిని మంగళహారతితో ఆహ్వానిస్తుంది. ఈ కథలో పదేళ్ళ అమ్మాయి జయ తన వయసుకు మించిన ఆలోచనలు, పనులతో కనిపిస్తూ మనల్ని చికాకు పరుస్తుంది. ఈ కథలో కనిపించే పాత్రలన్నీ మనకు ఎక్కడా నిత్య జీవితంలో తారసపడవు. పూర్తి ఆదర్శప్రాయమైన పాత్రల చిత్రీకరణతో పాత తెలుగు సినిమాలను మరిపిస్తాయి. "కొత్త గొంతులు" కథ కోడలు దిద్దిన కాపురాన్ని తెలియజేస్తుంది. 'అనుమానం' మొగుడి బాధలు పడలేక ఇంట్లోంచి బయటకు వచ్చిన వనజ సినిమా స్టారై భర్త కళ్ళు తెరిపించాలనుకుంటుంది. అమెరికా పెళ్ళికొడుకు భారతీయత మూర్తీభవించిన అమ్మాయి కోసం వెతకడం 'అంతరంగం'లో చూడవచ్చు. 'తిరోగమనం', 'బస్తీ టక్కరు' కథలు పల్లెటూరి వారిపై బస్తీవాసుల మోసాన్ని, దోపిడిని తెలియజేస్తాయి. పొలం తగాదా కక్షల్లో రెండు కుటుంబాలు సమూలంగా నాశనం కావడం 'పగబట్టిన పాములు'లో చూస్తాం. ఏనుగుకు, దేవుడికి మధ్య కాకుండా ఏనుగుకు, మావటికి మధ్యనున్న అనుబంధాన్ని చిత్రించిన విచిత్ర క్షేత్ర పురాణమే 'గణపతి' కథ. ఇన్ని ఫాంటసీలు చాలవన్నట్లుగా, దేవతలే దిగివచ్చి నీతిబోధ చేసే 'పుష్పకం' కథ మరొకటి. కరుణ రసంతో కూడుకున్న ఈ కథలన్నీ ఆదర్శప్రాయ జీవితాన్ని తెలియజేయడానికి ప్రయత్నిస్తాయి.

ఇందులో 'బస్తీ టక్కరు' అనే కార్డు కథ 1951లో 'చిత్రగుప్త'లో వచ్చింది. అప్పటి నుండి ఇప్పటి వరకు తాను రాసిన కథలను ప్రచురించుకున్నా, ఇందులో నాలుగు కాలాలపాటు నిలిచే కథ ఒక్కటి కూడా లేకపోవడం విచారకరం. ఈ కథలలో కొన్ని స్కెచ్‌ల మాదిరిగా, మరికొన్ని కథలు, డాక్యుమెంటరీలుగా ఉన్నాయని ఎవరైనా భావిస్తే అందులో ఆశ్చర్య పడాల్సిన పనిలేదు.

- కె.పి. అశోక్ కుమార్

యాంటీ గ్లోబలైజేషన్ 'కొలుపు'

ఇటీవల 'కొలుపు' పేరుతో కాసుల ప్రతాపరెడ్డి సాహిత్య వ్యాసాల సంకలనం వెలువడింది. ఇందులో 11 వ్యాసాలు ఉన్నాయి. విప్లవ సాహిత్యం దగ్గరి నుంచి ఇటీవలి తెలంగాణ అస్తిత్వ ఉద్యమ సాహిత్యం వరకు విశ్లేషించిన వ్యాసాలు ఇందులో ఉన్నాయి. 'వాళ్ళూ–మనం' అనే వ్యాసంలో తెలుగు సమాజంలోని అభివృద్ధి చెందిన వారి, అభివృద్ధిలో వెనుకబడినవారి సాహిత్యంలోని విభిన్నతను వ్యక్తం చేశారు ప్రతాపరెడ్డి. వర్గ, వర్ణ విశ్లేషణలకు సంబంధించిన మూలాలను పట్టుకునే ప్రయత్నం 'మళ్లీ ప్రారంభించడానికి..' అనే వ్యాసంలో కనిపిస్తుంది.

'కవిత్వాలకు ఉద్యమాలు రాలవు', 'పాతకలోకం క్షమించదు గాక క్షమించదు', 'ముస్లిం కవులకు లక్ష్మణరేఖలు గీస్తున్న నిరింద్రియ వేధావులు', 'వాళ్ళూ–మనమూ–అతనూ' అనే వ్యాసాలు ఇటీవల రాసినవి. ఆయా సందర్భాల్లో తెలుగు సాహిత్యంలో పొడసూపిన పెడధోరణులపై కొరడా దెబ్బలు. 'కవిత్వాలకు ఉద్యమాలు రాలవు' అనే వ్యాసంలో దళిత కవిత్వం ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో నిర్వర్తించాల్సిన పాత్ర ఏమిటి, అది ఎలా విఫలమైంది అనే విషయాన్ని విశ్లేషించాడు ప్రతాపరెడ్డి. అలాగే బిసి కవుల సమైక్యత సాధ్యమవుతుందా అనే ప్రశ్నను కూడా ఆయన లేవనెత్తారు. 'వాళ్ళూ–మనమూ–అతనూ' అనే వ్యాసం కాళోజీ 'నా గొడవ'పై సమీక్ష. ఇందులో ఒకటి, రెండు ప్రతిపాదనలు చేశాడు. ఈ ప్రతిపాదనలు ఆలోచించాల్సినవే. 'సైద్ధాంతిక వాస్తవికత–సామాజిక వాస్తవికత' అనే వ్యాసంలో సృజనాత్మక రచనలకు సిద్ధాంతాన్ని ఒక పనిముట్టుగా మాత్రమే ఉపయోగించాలని, ఆ సిద్ధాంతం వెలుగులో సామాజిక పరిస్థితులకు అద్దం పట్టే రచనలు చేయాలని, సిద్ధాంతం సత్యమని నిరూపించడానికి సృజనాత్మక రచనలు చేయడం వృథా ప్రయాస అని చెప్పారు ప్రతాపరెడ్డి.



కొలుపు
(సాహిత్య వ్యాసాలు),
రచన:
కాసుల ప్రతాపరెడ్డి,
వెల: రు. 30,
ప్రతులకు:
సహచర బుక్‌మార్క్స్
హైదరాబాద్.

దాదాపు అన్ని వ్యాసాల్లోనూ ప్రతాపరెడ్డి కొన్ని ప్రతిపాదనలు చేశారు. ఇవి స్థిరీకృత విశ్వాసాలకు కాస్త భిన్నమైనవి. ఈ ప్రతిపాదనలు కాస్త కటువుగానూ, నిక్కచ్చిగానూ వ్యక్తం చేశాడు. మనసులో స్థిరపరుచుకున్న అభిప్రాయాలను పక్కన పెట్టి చదివితే ఈ వ్యాసాల్లోని ప్రతిపాదనలు కొన్నయినా ప్రజాసాహిత్య పురోగతికి దోహదపడతాయనడంలో సందేహం లేదు. 'మాట్లాడడం అనివార్య వేళ..' ఈ పుస్తకం తెస్తున్నట్లు ప్రతాపరెడ్డి చెప్పారు. అందుకే ఈ పుస్తకానికి 'కొలుపు' అనే పేరు పెట్టాడేమో. ఇక ఈ పుస్తకానికి బి.యస్. రాములు సుదీర్ఘమైన ముందుమాట రాస్తూ ఇది యాంటీ గ్లోబలైజేషన్ అన్నారు. మొత్తం మీద ఈ పుస్తకం దశాబ్దానికి పైగా తెలుగు సాహిత్య పోకడలను రేఖామాత్రంగా పట్టిస్తూనే కొత్త ఆలోచనలకు తావు కల్పిస్తుంది.

- కె.ఎస్.

✻ గంగాధర్ వీర్ల

'మల్లెపూలు..మల్లెపూలు కలువపూలు కావాలా..
ఎన్నెన్ని వన్నెపూలు చిన్నారిపూలు',
....
గోపాలకృష్ణుడు నల్లన. గోకులంలో పాలు తెల్లన.
కాళిందిలో నీళ్లు చల్లన. పాట పాడగ నీ గుండె జల్లన.

'అందాల ఆనందం ఇందేనయ్యా
అందం చూడవయా ఆనందించవయా,
......
ఆ.. తోటలోనొకటి..ఆరాధనాలయము..
ఆ..ఆలయంలో అందగాడెవడే.

ఇలా హాయిగా సాగిపోయే సుమారు అర్థ శతాబ్దినాటి పాటలు మళ్లీ సంగీత ప్రియుల హృదయాలపై పన్నీరును చిలికాయి. ఎప్పుడు..ఎక్కడ..ఎలా?? అన్నదేగా మీ సందేహం.. అందుకనే విషయంలోకి వెళదాం పదండి....

గాన(బాల) సరస్వతి పరవశించిన వేళ!

తెలుగు సినిమారంగంలో తొలి నేపథ్య గాయనిగా ఖ్యాతికెక్కిన రావుబాలసరస్వతీదేవికి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 30వ తేది శనివారం హైదరాబాద్, రవీంద్రభారతి వేదికపై 'ఒక తార పుట్టిన వేళ' కార్యక్రమం వైభవంగా జరిగింది. సంగీత ప్రపంచంలో మూడు తరాలకు ప్రతినిధులుగా ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న గానకోకిల పి.సుశీల, మధురగాయని ఎస్.జానకి, హుషారు గీతాల స్వరఝరి ఎల్.ఆర్.ఈశ్వరి, గాన(బాల)గంధర్వుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం ఈ వేడుకల్లో పాల్గొని సంగీత సరస్వతికి స్వరాభినందన తెలియజేస్తూ అలనాటి ముచ్చట్లను ప్రేక్షకుల ముంగిట నెమరు వేసుకున్నారు. మరి వారి మాటలు విందామా?

పద్మశ్రీ ఎస్.పి.బాలు

కాస్త ముందుగా పుట్టి ఉంటే సరస్వతిగారితో కలిసి పాడే అదృష్టం దక్కేది. అయినా భవిష్యత్‌లో పాడతానేమో? మంద్ర స్థాయిలో మాధుర్యాన్ని పంచే ఆమె గళం ఎవ్వరికైనా అనిర్వచనీయమైన అనుభూతిని పంచుతుంది.

మధుర గాయని జానకి

సరస్వతిగారి పాటవింటే ఎంతో హాయిగా ఉంటుంది. తెలుగులో మేమిద్దరం కలిసి పాడలేక పోయినా కన్నడంలో కలిసి పాడాము. ఆమె పాట ఎంత అందంగా ఉంటుందో ఆమె రూపంకూడా అంత అందంగా ఉంటుంది. నేనేగనక మగవాడిగా పుట్టి ఉంటే సరస్వతిని నేనే పెళ్లి చేసుకొనేదాన్ని(నవ్వుతూ..).



గాన కోకిల సుశీల

చిన్నప్పుడు అంటే తొమ్మిది పది సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు నాకు చదువు వంటబట్టదని భావించి నన్ను ఏలూరు పవర్‌పేటలోవున్న చుట్టాలింటికి మా అమ్మా నాన్న పంపించేరు. ఇంటి పని నేర్చుకుంటూ.. బాలసరస్వతిగారి లలిత గీతాలను విని హుషారుగా పాడేదాన్ని. సినిమాల్లో ప్రవేశించడానికి ముందు ఎవరైనా పాటలు పాడమ్మా అని నన్నడిగితే 'ఆ.. తోటలోనొకటి.. ఆరాధనాలయము..'లాంటి జనరంజకమైన సరస్వతి గారు పాడిన పాటల్నే పాడేదాన్ని.

బాలకు 'లలిత సంగీత సరస్వతి' బిరుదు ప్రదానం

సినీ సంగీత వైభవానికి ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమానికి విసు కన్సల్టెంట్స్ సంస్థ అధినేత సిసిరెడ్డి ఆర్థిక సౌజన్యాన్ని అందించగా సినీ నిర్మాత రమణమూర్తి (అభినందన) నేతృత్వంలో ఏర్పటిన 'శ్రీరావుబాలసరస్వతి అభిమాన సంఘం' ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు నిర్వాహకుల పక్షాన గాయని రావు బాలసరస్వతికి 'లలిత సంగీత సరస్వతి' బిరుదును ప్రదానం చేశారు. విసు కన్సల్టెంట్స్ తరపున సోనియారెడ్డి రెండు లక్షలరూపాయల చెక్కును 'బాల'కు అందజేసి కళాకారులపట్ల తమ ఉదారతను చాటుకున్నారు. మునుపెన్నడూలేని విధంగా తెలుగు సినిమారంగానికి చెందిన పలువురు గాయనీ గాయకులు, సంగీత దర్శకులు కార్యక్రమంలో పాల్గొని 'బాల'కు పుట్టినరోజు శుభాకాంక్షలు అందజేశారు. కాగా విశిష్ట అతిథిగా విచ్చేసిన డాక్టర్ సి.నారాయణరెడ్డి స్వర్ణకంకణాన్ని, అలాగే సుశీల, జానకి, ఈశ్వరి నిర్వాహకుల పక్షాన వీణను బాలకు బహూకరించారు. డాక్టర్ సినారె మాట్లాడుతూ చిరు ప్రాయంలోనే గాన క్షేత్రంలోకి అడుగిడిన లలిత సంగీతరాణిగా రావుబాలసరస్వతి అద్భుతమైన గీతాలకు ప్రాణం పోశారని అన్నారు. చివరిగా రావుబాల సరస్వతీదేవి తన స్పందన తెలియజేస్తూ 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఊహించని సత్కారాన్ని నిర్వహించారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఏమైనా తెలుగు తెర గాయనీ గాయకులంతా అలనాటి గాయనీమణి రావుబాల సరస్వతికి సంఘీభావాన్ని తెలపడం శుభపరిణామం.!

మైమరపించే ఎల్.ఆర్.ఈశ్వరి

బాలసరస్వతి అక్క మధురమైన స్వరానికి నేనూ బానిసనే. 'అందాల ఆనందం ఇందేనయ్యా' లాంటి పాటల్ని ఇప్పటికీ హుషారునిస్తాయి.

ఫొటోస్: నరహరి

"డాక్టర్ గారూ! మా బిడ్డను త్వరగా చూడండి. చాలా సీరియస్‌గా ఉంది. పొద్దున దాకా బాగానే ఉన్నాడు. మధ్యాహ్నం నుండి నలతగా కనిపించాడు. ఒక్కసారిగా ఒళ్ళు కాలిపోయేలా జ్వరం వచ్చింది. భరించలేని తలనొప్పి అన్నాడు. తర్వాత వాంతులు మొదలయ్యాయి. ఇందాక పిచ్చిపిచ్చిగా మాట్లాడాడు. ఇప్పుడసలు, మన సోయిలోనే లేడు. కాసేపటికి, కాసేపటికి వంపులు (ఫిట్స్) కూడా వస్తున్నాయి. ఇదేం రోగమో! బిడ్డను ఒక్కరోజులో ఇలా చేసేసింది. మా బిడ్డ ప్రాణాన్ని కాపాడండి బాబూ!"

ప్రస్తుతం కొన్ని జిల్లాలలో అనేక ఆసుపత్రులలో వినిపిస్తున్న తల్లిదండ్రుల ఆవేదనా భరిత రోదన ఇది. ఆందోళన ఇది. ఈ ఆందోళనలు, ఆవేదనలు, రోదనలు, ఈయేడే మనకు కొత్తేం కాదు. ఏటా, గత దశాబ్ద కాలంగా జూన్–డిసెంబర్ నెలల్లో తరచుగా వినిపిస్తున్నవే. ఈ వ్యాధికి కారణం 'ఇది' అని తేల్చే లేబరేటరీలు, నిర్ధారించే పరీక్షలు అందరికీ అందుబాటులో లేవు. ప్రస్తుతం ఉన్నంతలో, వెన్నులోనీరు (సెరిబ్రో స్పైనల్ ఫ్లూయిడ్) తీసి, మామూలు పరీక్షలు నిర్వహించడం ద్వారా, ఇది మెదడుకు సోకిన వైరల్ వ్యాధేనని వైద్య నిపుణులు నిర్ధారిస్తున్నారు. అయితే ఏ రకం వైరస్ మెదడును ఆవరించిందో తెలుసుకోవాలంటే, వైరస్‌ను కల్చర్ చేయాలి. ఆ సదుపాయం అతి తక్కువ చోట్ల మాత్రమే ఉంది. వ్యాధికి గురైన వారందరి రక్తాన్ని వైరస్ కోసం కల్చర్ చేయడం సాధ్యం కాదు.



మెదడు వాపు వ్యాధి మొదలయ్యేది ఎలా?

ఈ నేపథ్యంలో... వ్యాధి లక్షణాలను బట్టి చూస్తుంటే 'అర్బోవైరస్'ల వల్ల వచ్చే జపానీస్ ఎన్‌సెఫలైటిన్ లానే అనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రోగగ్రస్తుల నుండి స్పెసిమన్స్‌ను సేకరిస్తోంది. వ్యాధి కారక వైరస్‌ను గుర్తించినా చికిత్సలో ఆశాజనక మార్పు ఉండదు. ఇప్పటికే మెదడువాపు వ్యాధి సోకిన పిల్లల ప్రాణాల విషయంలోగాని, బ్రతికి బట్టగడితే వచ్చే మానసిక అంగవైకల్యంలో గాని మార్పులు ఉండవు. అయితే వ్యాధి కారకం, వ్యాప్తి చెందే విధానాలు నిర్దిష్టంగా తెలిస్తే, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అదుపులో పెట్టే వీలుంది.

వ్యాధి పుట్టుపూర్వోత్తరాలు

సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఈ మెదడు వాపు వ్యాధి (ఎన్‌సెఫలైటిస్)ని జపాన్‌లో మొట్టమొదటిసారిగా కనుగొన్నారు. అందుకనే దీనిని "జపనీస్ ఎన్‌సెఫలైటిన్" అని పేర్కొంటున్నారు. దీనికి కారణం 'అర్బోవైరస్'లు అని, ఇవి దోమల ద్వారా వ్యాప్తి చెంది మెదడు వాపు వ్యాధికి కారణమవుతున్నాయని వైద్య శాస్త్ర పరిశోధనల్లో స్పష్టపడింది. తర్వాత క్రమేణా వ్యాధిగ్రస్థులు చైనా, కొరియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, వియత్నాం, ఇండియా, బర్మా, శ్రీలంకలలో బయట పడ్డారు. అసలా వైరస్ జపాన్ నుండి ఇతర దేశాలకు ఎలా వ్యాప్తి చెందింది అని పరిశీలిస్తే... పక్షులు, మనుషుల ద్వారా వ్యాప్తి చెందినట్లు తెలిసింది. మన దేశానికి సంబంధించి మొట్టమొదట 1955లో ఈ వ్యాధిని తమిళనాడు రాష్ట్రంలో గుర్తించారు. తర్వాత మెదడు వాపు వ్యాధిగ్రస్థులు అస్సాం, ఆంధ్రప్రదేశ్, బీహార్, గోవా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పాండిచ్చేరి, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలలో బయటపడ్డారు.

దేశ వ్యాప్తంగా లభ్యమవుతున్న అధికార గణాంక వివరాల ప్రకారం 1983లో 1716 కేసులు గుర్తించగా 1984లో 3370 కేసుల్ని, 1985లో 2490 కేసుల్ని, 1988లో 6867 కేసుల్ని, 1989లో 6489 కేసుల్ని, 1990లో 2916 కేసుల్ని, 1991లో 4071 కేసుల్ని, 1992లో 5010 కేసుల్ని గుర్తించారు. 1992 నుండి వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తున్నది. 1993-94 సంవత్సరంలో దేశ వ్యాప్తంగా వేలాది మంది వ్యాధి బారిన పడ్డారు.

మన రాష్ట్రం విషయానికి వస్తే... ప్రప్రథమంగా ఈ వ్యాధి 1978లో రాయలసీమ ప్రాంతంలో కనిపించింది. తర్వాత కోస్తా-ఆంధ్ర జిల్లాలలో వ్యాపించింది. కొన్ని సంవత్సరాల క్రితం తెలంగాణాలోని హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలలోను, చుట్టుపక్కల ప్రాంతాలలోను మహమ్మారిలా విజృంభించి 1987 వరకు ఆంధ్ర-కోస్తా ప్రాంతంలో అప్పుడప్పుడు మెదడువాపు వ్యాధి కనిపిస్తూనే ఉన్నా, 1988 నుండి మళ్లీ ఒక్కసారిగా విజృంభించడం ప్రారంభించింది. ప్రస్తుతం మెదడు వాపు వ్యాధి తీవ్రంగా ప్రబలుతోంది. వందలాది మందిని బలితీసుకుంటోంది.

ఎలా వ్యాప్తి చెందుతోంది ?

జపనీస్ ఎన్‌సెఫలైటిస్ ఇంతకు ముందే చెప్పినట్లుగా ఆర్బోవైరస్‌ల వలన వస్తున్నది. (అయితే మీజిల్స్, మమ్స్, రూబెల్లా, ఫాక్స్, హెర్పిస్, సైటో మెగాలో వైరస్‌లు మెదడువాపు వ్యాధికి కారణం కావచ్చును) అంతర్జాతీయ ప్రయాణ సౌకర్యాలు సులభమవ్వడంతో మనుషుల్లో ప్రపంచ యానం పెరిగింది. పక్షులు ప్రపంచ

వ్యాప్తంగా సంచరిస్తుంటాయి. ఆయా దేశాలలోని దోమలు, వైరస్‌ను పక్షులలోకి, మనుషులలోకి, పందులలోకి చేరవేస్తున్నాయి. తద్వారా వైరస్ ప్రపంచమంతా వ్యాప్తి చెందుతున్నది. ఆర్బోవైరస్ కలిగియున్న మనుషుల్ని లేదా పక్షుల్ని దోమలు కుట్టి రక్తం పీల్చేటప్పుడు వైరస్ దోమలలో చేరుతుంది. ఈ దోమలు మరల మనుషులను గాని, పందులను గాని కుట్టినపుడు ఆ వైరస్ వాటిలోచేరుతుంది. పక్షులలోగాని, పందులలోగాని, దోమలలోగాని వైరస్ ఎలాంటి వ్యాధి లక్షణాలను బహిర్గతం చేయడం లేదు. అంటే వాటికి ఎలాంటి హాని ఉండదు. పక్షులు, పందులు వైరస్ సంఖ్యాభివృద్ధికి 'రిజర్వాయర్స్'గా వ్యవహరిస్తున్నాయి. దోమలు వైరస్ వ్యాప్తికి 'వాహకాలు'గా పనిచేస్తున్నాయి.



మెదడువాపు వైరస్ కలిగిన దోమలు మనుషులను కుట్టినపుడు, దోమల లాలాజలం ద్వారా వైరస్ మానవుల రక్తంలోకి చేరుతున్నది. రక్తంలో చేరిన తర్వాత 5-15 రోజులలో వైరస్ వ్యాధి లక్షణాలను బహిర్గతం చేస్తుంది. ఈ వ్యవధినే వైద్యశాస్త్ర పరిభాషలో 'ఇంక్యుబేషన్ పీరియడ్' అంటారు. ఇక్కడ ప్రజలు గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే... వైరస్ శరీరంలో ప్రవేశించిన వారందరిలోనూ వ్యాధిని కలుగజేయలేదు. 9 నెలల నుండి 15 సంవత్సరాల మధ్య వయస్కులలోని అతికొద్దిమందిలోను, అతి అరుదుగా మధ్య వయస్కులలోను వ్యాధి లక్షణాలు బహిర్గతమవుతున్నాయి. వైరస్ అన్ని వయస్కుల వారికి ఉండవచ్చును. కాని లక్షణాలు మాత్రం బహిర్గతం కావు. అంటే ఆరోగ్యానికి ఎలాంటి హాని ఉండదు.

లక్షణాలు ఏమిటి ?

రక్తంలో చేరిన 'అర్బోవైరస్' ప్రధానంగా రక్తం ద్వారానే ప్రయాణించి మెదడు కణజాలాన్ని ఆశ్రయిస్తుంది. ఫలితంగా మెదడు కణాలు ఉబ్బుతాయి. మెదడులోని ఫ్లూయిడ్ (నీటి) శాతం పెరుగుతుంది. దీనినే 'సెరెబ్రల్ ఎడియా'గా పేర్కొంటారు. దీని కారణంగా ఒత్తిడి (ప్రెషర్) పెరిగి రక్తనాళాలు కుంచించుకుపోయి మెదడుకు రక్త సరఫరా తగ్గిపోతుంది. అందువల్ల మెదడు పనితీరు క్షీణిస్తుంది. ముందు, తీవ్రంగా జ్వరం, తలనొప్పి, వాంతులు వంటి ప్రాథమిక లక్షణాలతో మెదడు వాపు వ్యాధి ప్రారంభమై, మెదడు గట్టిగా బిగుసుకుపోవడం (నెక్ రిజిడిటి) జరుగుతుంది. మెదడు వ్యాధిగ్రస్థమై క్షీణిస్తున్న కారణంగా మతిస్థిమితం తప్పడం, క్రమేణా నోటిమాట కోల్పోవడం సంభవిస్తాయి. కొందరిలో ఫిట్స్ (మూర్ఛలు) కనిపిస్తాయి. గుండె కొట్టుకునే వేగం తగ్గుతుంది. వ్యాధి ముదిరిన దశలో రోగి పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్ళడం జరుగుతుంది. వ్యాధి వచ్చాక ప్రత్యేకమైన మందులు ఏమీ ఇంతవరకు లేవు.

ప్రస్తుతం వాడుతున్న యాంటి వైరల్ మందులు మెదడువాపు వ్యాధి విషయంలో ఎంత వరకు పని చేస్తాయన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. సపోర్టివ్, సింప్టమాటిక్ లక్షణాలకు తాత్కాలిక చికిత్స తప్ప రోగులకు చేయగలిగింది ఏమీ లేదు. చాలా మందిలో కారణాలు ఏవైనా మరణమే అంతిమ ఫలితం అవుతుంది. ఒకవేళ వ్యాధి నుండి కొద్దిమంది బయపడ్డా, వారిలో కాళ్ళు, చేతులు చచ్చుపడడం, మతిస్థిమితం కోల్పోవడం, తెలివితేటలు, జ్ఞాపకశక్తి నశించడం వంటి 'పోస్ట్ ఎన్‌సెఫలిటిక్ సీక్వెల్స్'తో శేష జీవితం గడపాల్సి వస్తుంది. ఈ లక్షణాలు లేకుండా వ్యాధి నుండి బయటపడే వారి సంఖ్య వేళ్ళ మీద లెక్కించవచ్చు.

వ్యాధిని ఎలా నిర్ధారిస్తారు ?

ప్రస్తుతం మెదడువాపు వ్యాధి నిర్ధారణ విషయంలో వ్యాధి లక్షణాలకే ప్రాధాన్యత ఇవ్వవలసి వస్తున్నది. ఈ వ్యాధి నిర్ధారణకు సాధారణ రక్త పరీక్షలు ఉపయోగపడవు. వెన్నులో నీరు తీసి పరీక్షించడం ద్వారా మెదడువాపు వ్యాధికి 'వైరస్' కారణమని స్థూలంగా తెలుస్తుంది. జపనీస్ ఎన్‌సెఫలైటిస్ అని అనుమానిస్తున్న కేసులు అది, అవునా కాదా అని తెలుసుకోవాలంటే ప్రత్యేక రక్త (సీరమ్) పరీక్షలు, వెన్నులో నీరు పరీక్షలు, వైరల్ కల్చర్ పరీక్షలు లేదా మెదడు కణజాల పరీక్షలు లేదా వైరల్ కల్చర్ పరీక్షలు చేయాలి. మొదటి రెండు పరీక్షలు ఏంటిజెన్, ఏంటిబాడీల, చర్యల ఆధారంగా చేసేవి. మెదడు కణజాల పరీక్షల్ని వైద్యకళాశాలలకు అనుబంధంగా ఉన్న 'పెథాలజి' డిపార్టుమెంటులలో చేయవచ్చును. కాని చేయడం లేదు.

గుంటూరు వైద్య కళాశాల పెథాలజి డిపార్టుమెంట్‌లో అయితే మెదడు వ్యాధుల విషయంలో బెంగుళూరులోని 'నిమ్‌హాన్స్'లో ప్రత్యేక శిక్షణ పొందిన 'న్యూరోపెథాలజిస్ట్' డాక్టర్ టి.ఆషా ఫణిభూషణ్ అందుబాటులో ఉన్నారు. మహమ్మారి వ్యాధి నిర్ధారణకు ఆమె సేవల్ని ప్రభుత్వం ఉపయోగించుకోవాలి. ప్రస్తుతం వైద్యాధికారులు రోగుల నుండి సేకరించిన రక్త నమూనాలను హైదరాబాద్‌లోని 'వెటర్నరీ బయోలాజికల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్'కు చెందిన జపనీస్ ఎన్‌సెఫలైటిస్ లాబోరేటరీకి, వైరల్ కల్చర్ పరీక్షకు పూనాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజి విభాగానికి పంపుతున్నారు.

వ్యాధికి వ్యాక్సిన్ ఉంది!

మెదడువాపు వ్యాధి ఎయిడ్స్ వంటిది కాదు. వ్యాధిని సమర్థవంతంగా నిరోధించే వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వైరస్‌ను చుంచెలుక మెదడులో కల్చర్ చేసి, క్రియారహితం చేయడం ద్వారా రూపొందించిన ఈ వ్యాక్సిన్ వ్యాధి నిరోధంలో సమర్థవంతంగా పని చేసినట్లు వైద్య పరిశోధనల్లో వెల్లడయింది. ఈ వ్యాక్సిన్‌ను రెండు మోతాదులలో 7-14 రోజుల వ్యవధిలో చర్మం కింద పొరలలోకి (సబ్ కుటేనియస్) ప్రాథమికంగా ఇవ్వాలి. అనంతరం సంవత్సరం లోపు ఒక బూస్టర్ మోతాదు తీసుకోవాలి. ఈ వ్యాక్సిన్ వలన శరీరంలో పెంపొందిన రోగ నిరోధక శక్తి మూడు సంవత్సరాల వరకు ఉంటుందని వైద్య పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

ప్రస్తుతం మన రాష్ట్రంలో కూడా ఈ వ్యాక్సిన్ అందరికీ అందుబాటులో లేదు. ఏటా ప్రబలుతున్న ఈ వ్యాధి నిరోధానికి వ్యాక్సినేషన్ మాత్రమే సరైన మార్గమన్న విషయాన్ని ప్రభుత్వ వైద్యాధికారులు గుర్తించాలి. వ్యాధి వ్యాప్తి చెందుతున్న ఏరియాలలోని పిల్లలందరికీ వ్యాక్సిన్ ఇప్పించే కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. దీనికితోడు ప్రజలు, ప్రభుత్వం, వ్యాధి వ్యాప్తికి కారణమవుతున్న దోమల నిర్మూలన కార్యక్రమాలను ఉధృతం చేయాలి. ప్రజల సహకారం లేకుండా, కేవలం ప్రభుత్వమే ఇలాంటి ప్రజారోగ్య సమస్యలను ఎట్టి పరిస్థితులలోను పరిష్కరించలేదు. ప్రజలు చైతన్యవంతులై ముందుకు వస్తే ఇలాంటి ఎన్నో సమస్యల్ని అతి సులువుగా పరిష్కరించుకోవచ్చన్నది వాస్తవం.

తమ నివాస పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడు చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిలువ ఉండే ప్రదేశాలు, గుంటలు లేకుండా చూసుకోవాలి. దోమల నివారణకు ప్రభుత్వం డి.డి.టి., బి.హెచ్.సి., పైరిథ్రమ్ స్ప్రే, మలాథియాన్ చల్లడం, ఫాగింగ్ వంటి క్రిమి సంహారక చర్యలను వైద్యాధికారుల సహకారంతో చేపట్టాలి. ప్రజలు దోమకాటు నుండి తప్పించుకునేందుకు దోమతెరలు కూడా వాడాలి. వైరస్‌కు రిజర్వాయర్లుగా వ్యవహరిస్తున్న పందులను నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచాలి. ప్రజల్లో మెదడువాపు వ్యాధిపై శాస్త్రీయ చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే మెదడువాపు వ్యాధిని ఎదుర్కొని అదుపులో పెట్టే అవకాశం ఉంటుంది. లేకపోతే ఇలానే ప్రతి ఏటా పిల్లలు ఈ వ్యాధికి బలికావాల్సి వస్తుందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. (హెల్త్ హెల్ప్ సౌజన్యంతో)



కైలాసం చెప్పసాగాడు.

"ఇంత క్రితం నువ్వు చదివిన వార్తలో 'సంఘటనా స్థలాన్ని సిఐ సందర్శించారు' అని కూడా ఉంది. సందర్శన అనే పదాన్ని అక్కడ రాయొచ్చా? కూడదా? అనేది రాసినాయనకు తెలియాలి. టూరిస్ట్ ఒక యాత్రా స్థలాన్ని సందర్శించడానికీ, ఒక పోలీసు అధికారి సంఘటనా స్థలాన్ని చూడటానికీ మధ్య తేడా లేదా? ఇక్కడ 'సందర్శన'కు బదులు 'పరిశీలన' అని రాయాలి. 'సంఘటనా స్థలాన్ని సిఐ పరిశీలించారు' అని రాయాలి.

"గుడ్.. అదీ.. ఇలాంటి దృష్టే రావాలంటున్నాను నేను. ప్రతి పదానికీ ఒక అర్థం ఉంటుంది. ఆ అర్థానికి సరిపోయినప్పుడే దానికి వాడాలి. అంతకంటే ముఖ్యంగా.. చెప్పదలుచుకున్న విషయానికి అవసరమైన పదసంపదను వెతుక్కోవాలి. ఏదోకటి తట్టింది కదాని రాసేయకూడదు. మనం వాడే పదం చెప్పదలచుకున్న అంశంలోని 'విషయా' (కంటెంట్)న్ని, సారాన్ని (స్పిరిట్)ని ఇవ్వగలగాలి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఆ విధమైన ఎక్సర్‌సైజు రాసేవాళ్లలో లేదా పబ్లిష్ చేసే వాళ్లలో జరగాలి" అన్నాడు కైలాసం.

"నేను ఇందాక చెప్పినట్లు 'వ్యాపించిన', 'విస్తరించిన' పదాలు కూడా ఇలాగే వాడుతున్నారు. 'వ్యాధులు విస్తరిస్తున్నాయి' అని రాస్తాడొకాయన. 'అభివృద్ధి చెందాలనే భావన రాష్ట్రమంతా వ్యాపిస్తోంది. అంటాడింకొకాయన. 'విస్తరణ' సానుకూల అర్థంలోనూ, వ్యాప్తి ప్రతికూల అర్థంలోనూ వాడటం సరైంది. అలాగే వృద్ధి, అభివృద్ధి పదాలనుకూడా విచక్షణా రహితంగా వాడేస్తున్నారు. వృద్ధిని నెగెటివ్ విషయాలకు.. అంటే దోమలు వృద్ధి చెందుతున్నాయి.. అని రాయాలి.

అభివృద్ధిని ఎలా వాడాలో అందరికీ తెలిసిందే. ఇక 'అభివృద్ధి'కి 'పెరుగుదల'కు తేడా లేకుండా వాడేస్తుండటమూ చూస్తుంటాం. ఈ రెండింటికీ 'అభివృద్ధే' అని రాసేస్తున్నారు. కొందరు 'ఆర్థిక' కాలమిస్టులు తప్ప.

ఈ రెంటికీ మధ్య 'డెవలప్‌మెంట్', 'గ్రోత్'ల మధ్య వున్న తేడాయే వున్నది. ఈ తేడాతోనే ఉపయోగించాలి. అభివృద్ధికి విస్తృతార్థం వుంది. అభివృద్ధిని అవసరం వైపు నుంచి (అంటే ఆబ్జెక్టివ్ వైపునుంచి) వాడాలి. పెరుగుదలను సాపేక్షంగా వాడతాం. పైగా అభివృద్ధిని నిర్దిష్టంగానూ, సాధారణంగానూ వాడొచ్చు. పెరుగుదలను నిర్దిష్టంగానే వాడతాం.

ఉదాహరణకు 'రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించిందనే' మాటను వింటుంటాం. ఇది అభివృద్ధా? పెరుగుదలా? ప్రజల మొత్తం అవసరాలను తీర్చగలిగిన దానిని అభివృద్ధి అంటాం. గతం కంటే మించి ప్రగతి సాధించి, అవసరాల మేరకు ప్రగతి జరిగినప్పుడు పెరుగుదల.. అనాలి." చెప్పాడు కైలాసం. సుబ్రహ్మణ్యం అవునన్నట్లు చూశాడు.

కైలాసం చెప్పేది వింటూనే వేరే వార్తలో కొన్ని లైన్లను అండర్‌లైన్ చేసిన సుబ్రహ్మణ్యం దానిని కూడా మిత్రుడి ముందు పెట్టాడు.

'దొంగలు ఎసి మిషన్‌ను విప్పి..' ఆ కన్నంలో నుంచి లోపలికి ప్రవేశించారు' అని ఉంది అందులో.

"దొంగలు జొరబడతారా? ప్రవేశిస్తారా? ముఖద్వారం నుంచి వస్తే ప్రవేశమనాలి. దొడ్డిదారినా, దొంగదారినా వస్తే జొరబడటం అనాలి కదా! ఇలా కొందరు రాస్తే ప్రతి రచనలోనూ తప్పుడు ప్రయోగాలు కనిపిస్తాయి.

"ఈరోజు గురునానక్ జన్మదినం సందర్భంగా గురుద్వారలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు" అనే వాక్యాన్ని చూపించి చెప్పాడు.

ఈ విధంగా 'వాజ్‌పేయి జయంతి' అనే రాసే పెద్ద మనుషులూ ఉన్నారు అన్నాడు కైలాసం విసుగుదల ప్రదర్శిస్తూ.

కీర్తిశేషులకు సంబంధించి 'జయంతి' అని, సమకాలీనుల జన్మదినాన్ని 'జన్మదినం' అని రాయాలని తెలియకపోవడం వల్ల వచ్చిన సమస్య ఇది. ఇలాంటి విషయాలయినా తెలియకపోతే.. ఆయా ప్రముఖులతో మాట పడవలసి వస్తుంది.. పైగా సంస్థకూ, మనకూ అపకీర్తియే.

"కొత్త ప్రతిష్ట రావడం కోసం మంచిగా రాయాలి. కొత్తగా అపకీర్తి రాకుండా ఉండాలంటే తప్పిదాలు రాయకుండా ఉండాలి" సూత్రంలాగా చెప్పాడు కైలాసం.

"సూత్రాలు కాదు.. సూక్ష్మంగా ఆలోచించి రాయడం కావలసినది" అన్నాడు సుబ్రహ్మణ్యం. ●

పాఠక స్పందన

చలింప చేసిన కవర్ స్టోరీ

ఆగస్టు 31 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కవర్ స్టోరీ 'విఘ్నేశ్వర రూపశిల్పికి బతుకంతా విఘ్నాలే' చదివిన తర్వాత 'ధూల్‌పేట' వాసుల కష్టాలు ఎలాంటివో తెలిసినవి. వాళ్ళ ఇబ్బందులు, కష్టనష్టాలు చలింపచేసేవిగా వున్నాయి. అదే విధంగా ఆరోగ్యం శీర్షికన అందించిన 'ఫ్లూజ్వరం' వ్యాసం వల్ల ఎన్నో శాస్త్రీయ వాస్తవాలు తెలిసినవి. అదే విధంగా ఇంతిసంగతులు కూడా మగమహారాజులకు కనవిప్పు కలిగించే విధంగా వుంది. అలాగే ఆగస్టు 24 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'అమ్మకానికి దేశభక్తి' వ్యాసం చదివి ఆశ్చర్యంతో పాటు, దిగ్భ్రాంతి కలిగాయి. అమెరికాలోని ప్రవాస భారతీయుడు మనోజ్‌రావు అనే అతని కూతురు భారత్ తరపు నుండి టెన్నిస్ ఆడడానికి ఐదుకోట్ల రూపాయలు 'అఖిల భారత టెన్నిస్ అసోసియేషన్' చెల్లించాలి లేకపోతే ఆడదు. ఇది చాలా విచిత్రంగా ఉంది. ఇలాంటి వారిని అవకాశవాదులు అంటారు. ఇది దేశభక్తిని అమ్ముకోవడమే అవుతుంది.

- ఎం.డి.ముస్తఖీమ్, కొల్లాపూర్

రియల్ స్టోరీ బాగుంది

ఆగస్టు 31 ఆదివారం అనుబంధంలో రియల్‌స్టోరీ శీర్షికన ప్రచురించిన 'అనాథలం కాదు' బాగుంది మేము నిజంగా చాలా బాధపడ్డాము. మా నయనాలు సజలమయ్యాయి. ఈ కథ చదువుతుంటే హృదయమున్న ప్రతివాడికి వీరిపట్ల ప్రేమ, జాలి, దయ కలుగకమానదు.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

సంతానము లేనివారికి

మాతృత్వం ఒక తీయని వరం. భార్యాభర్తల్లో లోపం ఎవరిదో తెలుసుకొని సరియైన చికిత్సద్వారా సంతాన భాగ్యాన్ని పొందే అవకాశాలున్నాయి.

1. మాకు పెళ్లయి చాలా సంవత్సరాలు గడిచినా సంతానము కల్గలేదు. ఎన్నోహాస్పటల్స్ తిరిగి పరీక్షలను చేయించి డబ్బులను కాలాన్ని వృథాచేసుకొని నిరాశ చెందాము. చివరిసారి ప్రయత్నంగా డాక్టరుగారిని సంప్రదించి మందు సేవించిన పిదప మేము పండంటి మగబిడ్డను పొందాము. 2. మాకు అసలే సంతానము కల్గలేదని ఎన్నో హాస్పటల్స్ తిరిగినాము. అయినా ఫలితం కలుగలేదు. చివరి ప్రయత్నంగా డాక్టరుగారిని సంప్రదించి ఔషధము సేవించిన పిదప రత్నం లాంటి మగబిడ్డను పొందాము. 3. మేము కూడ డాక్టరు వద్ద మందు సేవించిన పిదప ఒకే కాన్పులో బాబు,పాపను పొందాము. 4. ఒక అమ్మాయి పుట్టిన పిదప 12 సం॥లు గడిచినా మళ్లీ పిల్లలు కలుగలేదు. ఎన్నో హాస్పటల్స్ తిరిగి పరీక్షలను చేయించుకొని మందులను సేవించినాము. అయినా ఫలితము కలుగలేదు. నిరాశా

సమయమున డాక్టరుగారి వద్ద మందులు సేవించిన పిదప మేము మగబిడ్డను పొందాము.

ఒక సంతానము కలిగి మళ్లీ పిల్లలు కలగనివారు, అసలు సంతానము లేనివారు సంతానోత్పత్తి కణాలు తక్కువ ఉన్నవారికి అతి తక్కువ ఖర్చుతో చికిత్సచేయుట డాక్టరుగారి ప్రత్యేకత

శ్రీ వాణీ సంతాన సాఫల్య కేంద్రము డా॥ పానుగంటి దుర్గాచారి B.Sc., B.A. M.S.(OSM)

దిల్‌సుఖ్‌నగర్, సిటీ బస్ డిపో గేటు ప్రక్కన, సంతోషిమాతా గుడి ఎదురుగా, భవానీనగర్, Hyderabad.

Timings : 9 A.M. to 1 P.M. & 7 to 8 P.M ప్రతి శుక్రవారం సెలవు Ph : 24146539

మాకు బ్రాంచీలు, ట్రస్టులు మరే ఇతర సిబ్బంది లేరు. మా హాస్పటల్‌లో మాత్రమే సంప్రదించగలరు

శుభాకాంక్షలు

ప్రజలకు, అధికారులకు, మిత్రులకు

మా హార్ధిక శుభాకాంక్షలు

విద్యుత్ - అధికారులలకు ప్రజలు సహకరించి

బిల్లులు సకాలంలో చెల్లించగలరు.

కె.బ్రహ్మయ్య

ఎ.ఇ.,

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే

ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా : ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది